**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 61, పేజీలు - 08

గురువారం, ఆగష్టు 27, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# వరదలకు నేపాల్ విలవిల

**- ఉత్తర నేపాల్‌లో ఉగ్రరూపం దాల్చిన భోటేకోశీ నది - 95 మంది మృతి - 105 మంది భారతీయుల గల్లంతు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) హిమాలయ దేశం నేపాల్ ను అకస్మాత్తుగా విరుచుకుపడ్డ వరదలు కుదిపేశాయి. టిబెట్ నుంచి అకస్మాత్తుగా వచ్చిన వరద ధాటికి నేపాల్ లో నదులు పొంగిపొర్లాయి, వంతెనలు కొట్టుకుపోయాయి. కళ్లు తెరిచి చూసే లూపే వందలాది మంది గల్లంతయ్యారు. వీరిలో ఎంత మంది బతికి ఉన్నారు, ఇంకెంతమంది చనిపోయారో వివరాలు కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటివరకూ అందిన సమాచారం మేరకు 95 మంది చనిపోయారు. 348 మంది గల్లంతయ్యారు. ఇందులో 105 మంది భారతీయులే ఉన్నారు.నేపాల్ లోని భోటే కోషి నదిలో వచ్చిన ఆకస్మిక వరద నువాకోట్, ధాడింగ్ జిల్లాలను ముంచెత్తడంతో కనీసం ఎనిమిది మంది మరణించారు. అలాగే 105 మంది భారతీయులతో సహా పలువురు గల్లంతయ్యారు. నేపాల్ మీడియా నివేదికల ప్రకారం ఈ వరద నీరు సరిహద్దుకు టిబెట్ వైపు నుండి వచ్చి, నేపాల్‌లో విస్తృత నష్టాన్ని కలిగించి అనేక గ్రామాలను ముంచెత్తింది. ఇప్పటివరకు కనీసం ఎనిమిది మృతదేహాలను వెలికితీశారు. నేపాల్ టూరిజం బోర్డు ప్రకారం వరద ప్రభావిత ప్రాంతం నుండి 291



2లో..

# సాయానికి సిద్ధం

## - ప్రధాని బాలేన్ షాతో మాట్లాడిన మోదీ



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పొరుగు దేశం నేపాల్‌ను భారీ వరదలు ముంచెత్తాయి. రసువా ప్రాంతంలోని భోటే కోశీ నదిలో బుధవారం ఆకస్మికంగా సంభవించిన వరదల కారణంగా పెను విషాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో 100 మందికి పైగా భారతీయులతో సహా వందలాది మంది పర్యాటకులు గల్లంతయ్యారు. ఈ విపత్కర పరిస్థితుల్లో నేపాల్‌కు అండగా నిలుస్తామని భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. బుధవారం నేపాల్ ప్రధాని బాలేంద్ర షాతో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడారు. వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు. నేపాల్‌కు అవసరమైన అన్ని రకాల మానవతా సాయం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని ఆయన హామీ ఇచ్చారు. "ఈ కష్టకాలంలో నేపాల్ సోదర సోదరీమణులకు భారత ప్రజలు తోడుగా ఉంటారు. సహాయక చర్యల కోసం మన బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి" అని మోదీ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. నేపాల్ టూరిజం బోర్డు (ఎన్టీబీ) విడుదల చేసిన ప్రాథమిక నివేదిక ప్రకారం, ఈ వరదల్లో మొత్తం 384 మంది పర్యాటకులు గల్లంతయ్యారు. వీరిలో 105 మంది భారతీయులు, 93 మంది నేపాల్ పౌరులు, మిగిలిన వారు విదేశీయులు ఉన్నారు. గల్లంతైన విదేశీయులలో యూకే, ఆస్ట్రేలియా, అమెరికా, మలేషియా, దక్షిణాఫ్రికా, నెదర్లాండ్స్ దేశాలకు చెందిన వారు ఉన్నట్లు అధికారులు తెలిపారు. అయితే, ఈ సంఖ్య ప్రాథమికమైనదేనని, ట్రావెల్ ఏజెన్సీలు, స్థానిక అధికారులతో కలిసి వివరాలను ధ్రువీకరిస్తున్నామని ఎన్టీబీ స్పష్టం చేసింది. గల్లంతైన వారు తొమ్మిది వేర్వేరు ట్రావెల్ ఏజెన్సీల ద్వారా నేపాల్ పర్యటనకు వచ్చారని ప్రాథమిక సమాచారం. కాఠ్మండు టైమ్స్ కథనం ప్రకారం, ఈ దుర్ఘటనలో ఇప్పటివరకు ఏడుగురు మరణించినట్లు నిర్ధారణ అయింది. గల్లంతైన వారి ఆచూకీ కోసం అధికారులు, సహాయక బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. సమాచారం లేదా సహాయం కోసం పర్యాటకులు, వారి కుటుంబ సభ్యుల కోసం నేపాల్ టూరిజం బోర్డు పలు ఎమర్జెన్సీ నంబర్లను (1234, 1144, 9851289445) జారీ చేసింది. వరద ప్రభావిత ప్రాంతాల్లోని పర్యాటకులు ఆందోళన చెందవద్దని, అధికారిక ప్రకటనలను అనుసరించాలని సూచించింది.

# సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం

## - నా బిడ్డకు స్వతంత్రంగా మాట్లాడే హక్కుంది



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కాంగ్రెస్ చెలరేగిన కొండా సురేఖ కుమార్తె సుస్మిత కామెంట్స్ దుమారం రోజుకో మలుపు తిరుగుతోంది. ఆమె చేస్తున్న చర్యలు పార్టీకి వ్యతిరేకంగా ఉన్నాయని చర్యలు తీసుకోవాలని పీసీసీ నియమించిన క్రమశిక్షణ సంఘం తేల్చింది. పీసీసీ ప్రెసిడెంట్‌కు నివేదిక కూడా ఇచ్చింది. అయితే దీనిపై కీలక నేత భట్టి విక్రమార్కతో కొండా మురళీ చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మరిన్ని వ్యాఖ్యలు చేశారు. ఎలా, ఏం మాట్లాడాతో తన కుమార్తె ఇష్టమని వాటిని ప్రశ్నించే హక్కు తమకు లేదని అన్నారు. ఎవరి అభిప్రాయాలు వారికి ఉంటాయన్నారు. తాము మాత్రం కాంగ్రెస్‌లోనే కొనసాగుతామని అన్నారు. జరుగుతున్న పరిణామాలపై కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డితో కలిసి కొండా మురళి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో సమావేశమయ్యారు. సుస్మిత వ్యాఖ్యలు, తర్వాత క్రమశిక్షణ కమిటీ చేసిన సిఫార్సులు అన్నింటిపై మాట్లాడుకున్నారు. ఈ భేటీలో మంత్రి శ్రీధర్ బాబు కూడా పాల్గొన్నట్టు తెలుస్తోంది. ఈ సమావేశంలో ఏం నిర్ణయం తీసుకున్నారు అనేది మాత్రం తెలియడంలేదు. సమమావేశం నుంచి బయటకు వస్తున్న కొండా మురళిని మీడియా ప్రశ్నించింది. దీనికి ఆయన సమాధానం ఇస్తూ, తనకు గాంధీ ఫ్యామిలీపై పూర్తినమ్మకం ఉందని అన్నారు.

2లో..

# ఇక రాష్ట్రమంతటా 'సంజీవని'

## - సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా పౌరులందరికీ అత్యాధునిక, నాణ్యమైన వైద్యారోగ్య సేవలను ఉచితంగా, వేగవంతంగా అందించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా 'సంజీవని ప్రాజెక్టు'ను వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో బుధవారం (ఆగస్టు 26న) నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిజిటల్ హెల్త్ రికార్డుల నిర్వహణ ద్వారా రాష్ట్ర వైద్య ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావచ్చని స్పష్టం చేశారు.

**దేశానికి రోల్ మోడల్‌గా ఆంధ్రప్రదేశ్**

చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేసిన సంజీవని అద్భుత ఫలితాలను ఇచ్చిందని, ఇదే విజయవంతమైన నమూనాను రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించాలన్నారు. ఏపీ వైద్య రంగాన్ని దేశంలోనే ఇతర రాష్ట్రాలు అనుసరించేలా ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

2లో..

# ఆంధ్రప్రదేశ్‌లో కరువు.. రైతుల్ని పట్టించుకోరా.?

## - చంద్రబాబుపై వైఎస్ జగన్ ఆగ్రహం



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రమైన కరువు పరిస్థితులు ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ . మొత్తం 28 జిల్లాలకు గాను 25 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైందని రాయలసీమతో పాటు కోస్తా ప్రాంతాల్లో తీవ్రమైన కరువు ఉందన్నారు. జూన్ నెల నుంచి ఇప్పటి వరకు 52 శాతం వర్షపాతం నమోదైందని మొత్తం 688 మండలాల్లో 625 మండలాల్లో లోటు వర్షపాతం ఉందన్నారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ముందే తెలిసినా ఇప్పటి వరకు రైతుల్ని ఆదుకునే చర్యలేవీ తీసుకోలేదని రాబోయే రోజుల్లో

2లో..

## వృద్ధులు, అమాయకులే టార్గెట్‌గా "హైబ్రిడ్ సైబర్ ఫ్రాడ్"

**- కొత్త రకం మోసంపై సీపీ సజ్జనార్ హెచ్చరిక**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రెగ్యూలర్‌గా జరిగే జేబు దొంగతనాల్లా కాకుండా ఆధునిక సైబర్ నేరాలు జరుగుతున్నాయని, హైబ్రిడ్ సైబర్ ఫ్రాడ్ గ్యాంగ్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని హైదరాబాద్ సీపీ సజ్జనార్ ప్రజలను అప్రమత్తం చేశారు. అమాయకుల బ్యాంక్ ఖాతాలను ఖాళీ చేస్తున్న సరికొత్త 'హైబ్రిడ్ సైబర్ ఫ్రాడ్' పై సీనియర్ సిటిజన్లు,

2లో..

# రేవంత్ పాలన భూముల వ్యాపారంగా సాగుతోంది

**- కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాల వల్ల హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటోందన్న హరీశ్**

**- పార్కులు, ప్లాట్లు, ప్రభుత్వ స్థలాలు కనిపిస్తే అక్కడ భూములను అమ్మేస్తున్నారని ఆరోపణ**

**- లక్షల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కొంటున్నారని మండిపాటు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మాజీ మంత్రి హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వానికి హెచ్చరిక చేసారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ లేదని విమర్శించారు. ప్రభుత్వం మెడలు వంచి బాధితు లకు న్యాయం చేసే బాధ్యత తమపై ఉందని చెప్పారు. బాధితులకు న్యాయం చేయకుంటే తాము పోరాటానికి సిద్ధమని వెల్లడించారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సెక్షన్ 22ఏను తొలగింపజేస్తామని స్పష్టం చేశారు. సెక్షన్ 22ఏ జాబితాలోని భూములన్నీ తొలగించకుంటే సెక్రటేరియట్ ముట్టడిస్తామని హరీష్ హెచ్చరించారు. బీఆర్ఎస్ మాజీ నేత హరీష్ కీలక వ్యాఖ్యలు చేసారు. సెక్షన్ 22ఏ బాధితుల సమావేశంలో వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ ఉద్దేశంతో సెక్షన్ 22ఏ తీసుకొచ్చిందని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో ప్రజలు కేంద్రంగా పరిపాలన కొనసాగిందని తెలిపారు. అదే రేవంత్ పాలనలో భూములు కేంద్రంగా పరిపాలన కొనసాగుతోందని విమర్శించారు. ప్రజలకు ఏం కావాలో ఆలోచించిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ తాగునీరు, 24 గంటల కరెంటు

2లో..

## కొండా సురేఖ విషయంలో సీఎం మాటే నా మాట

**- కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కామెంట్స్**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో తీవ్ర ఉత్కంఠ రేపుతున్న కొండా సురేఖ వ్యవహారంపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రి కొండా సురేఖ, కాంగ్రెస్ నేత చిన్నారెడ్డి వ్యవహారంలో ఇప్పటికే క్రమశిక్షణ కమిటీ తన రిపోర్టును టీపీసీసీకి అందించిందని ఇందులో పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయమే తుది నిర్ణయమని స్పష్టం చేశారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే ఇదే విషయాన్ని చెప్పారని ఈ వ్యవహారంలో

2లో..

## సెప్టెంబర్ 15లోగా రెండో విడత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి

**- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటన**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పేదవాడి సొంతింటి కలను సాకారం చేయడంలో కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా తెలంగాణ ప్రజా ప్రభుత్వం వెనక్కి తగ్గదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాలలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధుల కోసం ఏడాదిగా ఎదురుచూశామని, పలుమార్లు

2లో..

## ఫాస్టాగ్ నుంచి ట్రాఫిక్ చలాన్లు కట్

**- హైదరాబాద్ పోలీసుల బిగ్ ప్లాన్!**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ రోడ్లపై ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించి ప్రయాణించే వాహనదారులకు భారీ షాకిచ్చే దిశగా ట్రాఫిక్ పోలీసులు కీలక అడుగులు వేస్తున్నారు. వాహనాలపై పదుల సంఖ్యలో చలాన్లు, వేల రూపాయల పెండింగ్ ట్రాఫిక్ జరిమానాలు ఉండటంతో యథేచ్ఛగా ట్రాఫిక్ ఉల్లంఘనలు జరుగుతూనే ఉన్నాయి. వాహనదారులను ట్రాఫిక్ రూల్స్ పాటించేలా చేసేందుకు

2లో..

ప్రజాప్రశ్న

హైదరాబాద్ గురువారం 27, ఆగష్టు 2026

# ఇక రాష్ట్రమంతటా 'సంజీవని'

ప్రస్తుతం రాష్ట్రంలో ప్రతి కుటుంబం తమ సంపాదనలో అధిక మొత్తం విద్య, వైద్యానికే ఖర్చు చేయాల్సి వస్తోంది. అందుకే సంజీవని వంటి పథకాల ద్వారా ప్రజలకు వైద్య ఖర్చులను తగ్గించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఈ వినూత్న ప్రాజెక్టులో అధికారిక భాగస్వామిగా వ్యవహరిస్తున్న ప్రముఖ టాటా ఎండీ సంస్థ వైద్యారోగ్య రంగంలో సరికొత్త సాంకేతిక ఆవిష్కరణలతో ముందుకు రావలసిందిగా సీఎం చంద్రబాబు నిర్దేశించారు. సంజీవని కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు అధికారులు 90 రోజుల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. ఇందులో భాగంగా బేస్‌లైన్ అధ్యయనం నిర్వహించడం, సమగ్ర డిజిటల్ మౌలిక వసతులు కల్పించడంతో పాటు వైద్య సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. జాతీయ, రాష్ట్ర పోర్టళ్లతో డేటాను అనుసంధానించడం వంటి చర్యలు చేపట్టనున్నారు. మొత్తం 28 జిల్లాల్లోని క్షేత్రస్థాయి వైద్య సిబ్బందికి దీనిపై పూర్తి అవగాహనతో పాటు శిక్షణ కల్పిస్తామని అధికారులు సీఎం చంద్రబాబుకు వివరించారు.

### డేటా ప్రైవసీకి ప్రాధాన్యం

వైద్య సేవలందిస్తున్న సమయంలో రోగుల డేటా భద్రత, గోప్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అందించే వైద్య సేవలు ప్రిడెక్టివ్ (ముందస్తు అంచనా), ప్రివెంటివ్, క్యూరేటివ్ (చికిత్స), తక్కువ ఖర్చు విధానంలో ఉండాలని స్పష్టం చేశారు. కేవలం మందులు ఇవ్వడమే కాకుండా ప్రజల్లో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, జీవనశైలి మారేలా చైతన్యం తేవాలన్నారు. అల్లోపతితో పాటు ఏఐ డాక్టర్ టెక్నాలజీ, హోమియోపతి, ఆయుర్వేదం, యోగా, ప్రాణాయామం వంటి సాంప్రదాయ పద్ధతులను కూడా అనుసంధానించాలని సూచించారు. రోగుల మొబైల్ ఫోన్లకు నేరుగా హెల్త్ అప్‌డేట్స్ పంపే ఆధునిక వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని, ఆసుపత్రుల్లో శానిటేషన్, ఔట్ సోర్సింగ్ పై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సరిగ్గా పనిచేయని ఔట్ సోర్సింగ్ సంస్థలను తొలగించేందుకు కఠినమైన విధానాన్ని అమలు చేయాలన్నారు. చిత్తూరు, కుప్పం ప్రాంతాల్లో సంజీవని పైలట్ ప్రాజెక్ట్ సాధించిన పురోగతి ఆధారంగా హైపర్‌టెన్షన్ కేసుల్లో 56 శాతం నియంత్రణ సాధించారు. డయాబెటిస్ తీవ్రత 16 శాతం తగ్గినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ప్రాథమిక ఆరోగ్య సేవల వినియోగం కూడా బాగా పెరిగింది. అలాగే సర్వేలో 91 శాతం మంది పౌరులు తమ ఆరోగ్యంపై అవగాహన పెరిగిందని సంతృప్తి వ్యక్తం చేశారు. స్క్రీనింగ్ నుంచి ఫాలోఅప్ వరకు ప్రతి దశలో ఏఐ ఆధారిత ఆరోగ్య వ్యవస్థను సిద్ధం చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, కార్యదర్శి వీరపాండియన్, సంయుక్త కార్యదర్శి రోణంకి గోపాలకృష్ణ మరియు టాటా ఎండీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# రేవంత్ పాలన భూముల వ్యాపారంగా సాగుతోంది

అందించారని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలని కేసీఆర్ తపన పడ్డారని చెప్పారు. కేసీఆర్ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచారని అన్నారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చారని తెలిపారు. దేశానికే తెలంగాణను అన్నపూర్ణగా మార్చారని పేర్కొన్నారు.

### సెక్రటేరియట్ ముట్టడి హెచ్చరిక

రాష్ట్రవ్యాప్తంగా కోటి ఎకరాలను సెక్షన్ 22ఏ జాబితాలో చేర్చారని హరీశ్‌రావు తెలిపారు. ఒక్క హైదరాబాద్‌లోనే లక్షలాది ఆస్తులను ఈ జాబితాలో పెట్టారని పేర్కొన్నారు. కాలనీలకు కాలనీలు 22ఏ జాబితాలోకి వెళ్లాయని అన్నారు. రాత్రికి రాత్రి భూములన్నీ నిషేధిత జాబితాలో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు గుండెమీద చెయ్యేసుకుని ప్రశాంతంగా నిద్రపోయే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడు హైడ్రా వస్తదో.. ఎప్పుడు సెక్షన్ 22ఏ వస్తదో అని భయంలో బతుకుతున్నారని తెలిపారు. కేసీఆర్ పాలనలో హైదరాబాద్‌లో అద్భుతమైన అభివృద్ధి జరిగిందని హరీశ్‌రావు కొనియాడారు. యావత్ దేశం హైదరాబాద్ వైపు చూసేలా కేసీఆర్ చేశారని అన్నారు. రేవంత్ రెడ్డి వచ్చాక హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ మంటగలిసిపోయిందని మండి పడ్డారు. అమెరికాలో ఉన్న మనవాళ్లు ఇక్కడ ఇండ్లు కొనడం ఆపేశారని తెలిపారు. పైసలుంటే అమెరికాలోనే పెట్టుబడులు పెట్టుకుంటున్నారని చెప్పారు.

# వృద్ధులు, అమాయకులే టార్గెట్‌గా "హైబ్రిడ్ సైబర్ ఫ్రాడ్"


సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలన్నారు. వీరినే టార్గెట్ చేసుకుని ఈ ముఠాలు వ్యవస్థీకృతంగా దోపిడీకి పాల్పడుతున్నట్లు పోలీసు దర్యాప్తులో వెల్లడైంది.

### అసలేంటీ హైబ్రిడ్ సైబర్ ఫ్రాడ్

బస్టాండ్లు, రద్దీగా ఉండే బస్సుల్లో ప్రయాణికులు తమ ఫోన్‌ను అన్‌లాక్ చేసే సమయంలో పిన్ లేదా ప్యాటర్న్‌ను బాగా గమనిస్తారు. ఆ తర్వాత అదే వ్యక్తి ఫోన్లను దొంగిలిస్తున్నారు. ఒకవేళ స్క్రీన్ లాక్ పిన్ తెలియకపోతే బాధితులు తమ ఫోన్‌కు కాల్ చేసినప్పుడు తాము బస్సు కండక్టర్లమని, ఫోన్ ఇచ్చేస్తామని నమ్మిస్తారు. ఓనర్ వెరిఫికేషన్ పేరిట మాయమాటలు చెప్పి వారి నుండి స్క్రీన్ పాస్‌వర్డ్లను తెలివిగా తెలుసుకుంటున్నారని సజ్జనార్ తెలిపారు.ఇలా సంపాదించిన పాస్‌వర్డ్లతో ఫోన్ ఓపెన్ చేసి, ఫోన్ గ్యాలరీ, నోట్స్ యాప్‌లలో యూజర్లు సేవ్ చేసుకున్న డెబిట్ కార్డులు, ఆధార్ లేదా పాన్, బ్యాంకు అకౌంట్, ఇతర కార్డుల వివరాలను సేకరిస్తున్నారు. ఆపై దొంగిలించిన సిమ్ కార్డుకు వచ్చే ఓటీపీల ఆధారంగా యూపీఐ, నెట్ బ్యాంకింగ్ పాస్‌వర్డ్లను రీసెట్ చేస్తారు. ఖాతాల్లోని డబ్బును ఆన్‌లైన్ గేమింగ్ యాప్స్, మ్యూల్ అకౌంట్లకు మళ్లించి విత్‌డ్రా చేస్తున్నారు. ఈ తరహా నేరాలపై స్పందించిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం ఇప్పటికే ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసింది. నిందితుల వద్ద నుంచి 5 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుంది.ఈ హైబ్రిడ్ నేరాల బారిన పడకుండా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఫోన్ పోయినప్పుడు ఎవరైనా కాల్ చేసి తిరిగి ఇచ్చేస్తామని చెప్పినా, ఎట్టిపరిస్థితుల్లోనూ స్క్రీన్ లాక్ పిన్, పాస్‌వర్డ్ లేదా ఓటీపీలను ఎవరితోనూ షేర్ చేసుకోవద్దని సజ్జనార్ హెచ్చరించారు. ఏటీఎం కార్డులు, బ్యాంకు పాస్‌బుక్, ఆధార్, పాన్ కార్డుల ఫోటోలను ఫోన్ గ్యాలరీలో గానీ, నోట్స్ యాప్‌లో గానీ ఎప్పుడూ సేవ్ చేసుకోకూడదని సూచించారు. ఒకవేళ ఫోన్ పోయిన వెంటనే సిమ్ కార్డును, బ్యాంక్/ యూపీఐ సర్వీసులను తక్షణమే బ్లాక్ చేయించడంతో పాటు సిఈఐఆర్ పోర్టల్‌లో ఫోన్‌ను బ్లాక్ చేయాలని సజ్జనార్ అవగాహన కల్పించారు. ఏదైనా సైబర్ మోసం జరిగినట్లు గుర్తిస్తే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు లేదా సైబర్ క్రైమ్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ముఖ్యంగా ఇంట్లోని పెద్ద వారికి, టెక్నికల్ నాలెడ్జ్ అంతగా లేని వారికి ఈ మోసాల గురించి స్పష్టంగా వివరించి. వారిని అప్రమత్తం చేయాలని హైదరాబాద్ సీపీ సజ్జనార్ కోరారు.

# రజని నిర్ణయానికి హైకోర్టు బ్రేక్

- చిలకలూరిపేట మున్సిపాలిటీలో మూడు పంచాయతీల విలీనానికి స్వస్తి
- గ్రామసభల నిర్వహణలో నిబంధనలు పాటించలేదన్న న్యాయస్థానం
- గణపవరం, పసుమర్రు, మానుకొండవారిపాలెం ఇక పంచాయతీలుగానే



పల్నాడు(ప్రశ్న న్యూస్) చిలకలూరిపేట పురపాలక సంఘంలో మూడు గ్రామ పంచాయతీల విలీనానికి తెరపడింది. గణపవరం, పసుమర్రు, మానుకొండవారిపాలెం పంచాయతీలను మున్సిపాలిటీలో విలీనం చేస్తూ 2020లో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రద్దు చేసింది. సరైన చట్టబద్ధ ప్రక్రియను అనుసరించకుండా విలీన ప్రక్రియ చేపట్టారని న్యాయస్థానం పేర్కొంది. దీంతో ఆయా గ్రామాలు తిరిగి గ్రామ పంచాయతీలుగా కొనసాగనున్నాయి.మాజీ వైకాపా మంత్రి విడదల రజని హయాంలో తీసుకున్న నిర్ణయమే విలీనానికి కారణమని స్థానిక రాజకీయ వర్గాలు ఆరోపిస్తున్నాయి. అయితే, ఈ విలీన ప్రక్రియను గణపవరానికి చెందిన న్యాయవాది తూబాటి పూర్ణచంద్రరావు హైకోర్టులో సవాలు చేయడంతో కేసు విచారణకు వచ్చింది.నిబంధనలు పాటించలేదన్న కోర్టుచిలకలూరిపేట మున్సిపాలిటీలో మూడు గ్రామాలను విలీనం చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎంఎస్ నం.83, జీవో ఎంఎస్ నం.260లను హైకోర్టు రద్దు చేసింది. న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.గ్రామసభల నిర్వహణలో నిర్దేశిత విధానాలను పాటించలేదని న్యాయస్థానం గుర్తించినట్లు పేర్కొంటున్నారు. గ్రామసభ నిర్వహణకు కనీసం 48 గంటల ముందు దండోరా వేయడం, బహిరంగ ప్రకటన చేయడం వంటి నిబంధనలను సక్రమంగా అనుసరించలేదని కోర్టు అభిప్రాయపడింది. సమర్పించిన తీర్మాన పత్రాల్లో తేడాలు, దిద్దుబాట్లు ఉన్న అంశాన్ని కూడా న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది.సరైన చట్టబద్ధ ప్రక్రియను అనుసరించకుండా చేపట్టిన విలీనం చెల్లదంటూ దాఖలైన డబ్ల్యూపీ నం.19692/2020ను హైకోర్టు అనుమతించింది.

### ఎన్నికలు జరిగాక తీర్పు

విలీన ప్రక్రియపై న్యాయస్థానంలో కేసు కొనసాగుతుండగానే చిలకలూరిపేట పురపాలక సంఘంలో వార్డుల విభజన చేసి ఎన్నికలు నిర్వహించడంపై కూడా స్థానికంగా చర్చ జరుగుతోంది. గణపవరం పంచాయతీ పరిధి నుంచి ఐదుగురు కౌన్సిలర్లు మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించారు.కోర్టు తుది తీర్పునకు లోబడి ఎన్నికైన విలీన గ్రామాల కౌన్సిలర్లకు గెలుపు ధ్రువీకరణ పత్రాలు అందజేసినట్లు స్థానిక వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం హైకోర్టు తీర్పుతో వారి భవిష్యత్తుపైనా స్పష్టత రావాల్సి ఉంది.

# ఆంధ్రప్రదేశ్‌లో కరువు..రైతుల్ని పట్టించుకోరా.?

పరిస్థితులు మరీ దారుణంగా ఉండబోతున్నాయన్నారు.రాష్ట్రాన్ని కరువు కాటేస్తున్నా చంద్రబాబు కళ్లు తెరవడంలేదన్నారు జగన్. కరువుతో ఇబ్బందిపడే రాయలసీమ ప్రాంతంతో పాటుగా ఇప్పుడు కోస్తాలోనూ అలాంటి పరిస్థితులే చూస్తున్నామన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన తర్వాత, మధ్యలో జులై 10న పంటలకు నీళ్లిస్తామని మంత్రులు ప్రకాశం బ్యారేజీ లాకుల దగ్గర ఫోజులిచ్చి ఫోటోలు దిగి పబ్లిసిటీ స్టంట్‌లు చేశారని ఎద్దేవా చేశారు. వీళ్లను నమ్మి, నీళ్లిస్తారని కృష్ణాడెల్టా రైతులతో పాటుగా మిగిలిన ప్రాంతాల్లోని రైతులు అప్పులు చేసి, పెట్టుబడి పెట్టి, అష్టకష్టాలు పడి విత్తనాలు, ఎరువులు కొని, నార్లు వేశారన్నారు. ఇప్పుడు పొలాల్లో నార్లు ఎండిపోయాయని.. రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు మానవత్వం లేకుండా వ్యవహరిస్తున్నారని ముఖ్యంగా రాయలసీమ ప్రాంతానికి నీళ్లు ఇచ్చే విషయంలో ఆయన తీరు దుర్మార్గంగా ఉందన్నారు.శ్రీశైలం రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 885 అడుగులుగా ఉంటే ఈ ఆగస్టులోనే 879.50 అడుగులకు నీళ్లు వచ్చినా సరే పోతిరెడ్డిపాడు ద్వారా రాయలసీమ ప్రాజెక్టులకు నీళ్లు ఇవ్వడానికి మనసు రాలేదన్నారు జగన్. నాగార్జునసాగర్ కింద ప్రాంతాల్లోని వ్యవసాయం పరిస్థితి కూడా అలాగే ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం నాగార్జున సాగర్ కింద పులిచింతల దగ్గర రెండు లిఫ్ట్‌లు అక్రమంగా లిఫ్ట్‌లు పెట్టి, పంపుహౌస్‌లు కడుతున్నా చంద్రబాబు చోద్యం చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు జగన్. తెలంగాణలోని చింతలపాలెం మండలం పాత వెల్లటూరు దగ్గర మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం పంప్ హౌజ్ పనులు చేపట్టారని చెప్పుకొచ్చారు. పులిచింతల ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ నుంచి 8 టీఎంసీలు తరలించడానికి రూ.1,450 కోట్లతో ఈ ప్రాజెక్ట్ చేపట్టారన్నారు. తెలంగాణలోనే చింతలపాలెం మండలం బుగ్గమాదారం దగ్గర పులిచింతల ప్రాజెక్టు దిగువన రాజీవ్ ఎత్తిపోతల పథకం పనులు చేస్తున్నారన్నారు. రూ.394 కోట్లతో కృష్ణా నది నుంచి 2.5 టీఎంసీలు తరలించడానికి ఈ ప్రాజెక్టును చేపట్టారని జగన్ ఆరోపించారు.చంద్రబాబు రైతులకు ఆర్థికంగా రక్షణగా ఉండే వైఎస్సార్ ఉచిత పంటల బీమాను రద్దుచేసి, రైతులకు తీవ్ర అన్యాయం చేశారని జగన్ ఆరోపించారు. రైతులే ప్రీమియం డబ్బులు చెల్లించాల్సి వస్తోందని 2022-23లో ఖరీఫ్ సీజన్‌లో 1.18 కోట్ల దరఖాస్తులకు ఉచిత బీమా వర్తిస్తే 2026-27 ఖరీఫ్‌లో కేవలం 35.17 లక్షల దరఖాస్తులు మాత్రమే పంటలబీమా కిందకు వచ్చాయన్నారు. జులైలో ఉచిత పంటలబీమాకు సంబంధించి కట్టాల్సిన ప్రీమియంను చంద్రబాబు కట్టకుండా వదిలేశారని ఆరోపించారు. దీంతో రైతులకు అందాల్సిన దాదాపు రూ.3వేల కోట్లు రైతులకు రాకుండా పోయాయన్నారు. రాష్ట్రంలో పంటలకు సరైన గిట్టుబాటు ధరలు కూడా లేవన్నారు. రైతులకు సున్నావడ్డీ పథకాన్ని కూడా అమలు చేయడం లేదని విమర్శించారు.చంద్రబాబు రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ తమపై తప్పుడు ప్రచారాలు, అబద్ధాలు చెబుతున్నారని ధ్వజమెత్తారు జగన్. కానీ కరువు సమయంలో రైతుల్ని, ప్రజల్ని ఎలా ఆదుకుంటారో మాత్రం చెప్పడం లేదని ఈ అంశంపై ముందస్తు ప్రణాళిక కూడా లేదన్నారు. వ్యవసాయరంగంపై ఆధారపడి ఉపాధి పొందుతున్న కూలీలకు అదనంగా ఉపాధి హామీ పనులు కల్పించాలని.. పేదలు ఆహార భద్రతను కల్పించాలన్నారు. రాష్ట్రంలో రైతుల సమస్యలపై దృష్టి పెట్టకుండా ప్రభుత్వం డైవర్షన్, రెడ్‌బుక్ రాజకీయాలపై ఫోకస్ పెట్టిందని విమర్శించారు. ఇలాంటి కరువు పరిస్థితుల్లో ప్రజలు, రైతుల్ని ఆదుకోవడానికి ప్రభుత్వం దగ్గర ఎలాంటి ప్రణాళిక ఉందో చెప్పాలని డిమాడ్ చేశఆరు జగన్. ఈ అంశాలపై చంద్రబాబు ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు జగన్.

# కొండా సురేఖ విషయంలో సీఎం మాటే నా మాట

సీఎం మాటే తన మాట అని రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఇక కొండా సురేఖ వ్యవహారంలో రాయబారం చేసేందుకే తాను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిశానని జరుగుతున్న ప్రచారాన్నిఖండించారు.కొండా సుస్మిత వ్యాఖ్యలు, చిన్నారెడ్డి వ్యవహారంపై స్పందించిన రాజగోపాల్ రెడ్డి.. కాంగ్రెస్‌లో క్రమశిక్షణ కమిటీఉందని గుర్తుచేశారు. సంబంధిత అంశాలను పరిశీలించిన కమిటీ పీసీసీకి నివేదిక సమర్పించిందని చెప్పారు. ఇక దీనిపై అధిష్ఠానం తీసుకునే నిర్ణయాన్ని ఎవరూ కాదనలేరని అన్నారు. ఇటీవల కొండా సురేఖ, చిన్నారెడ్డిపై పార్టీ క్రమశిక్షణ కమిటీ నివేదిక సమర్పించిన నేపథ్యంలో రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. పార్టీ అంతర్గత వ్యవహారాల్లో అధిష్ఠానం నిర్ణయానికి తాను కట్టుబడి ఉంటాననే సంకేతాన్ని ఆయన ఇచ్చారు.డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో తన భేటీపై కూడా రాజగోపాల్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు.ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్కని కలవడం పూర్తిగా తన నియోజకవర్గ అభివృద్ధి, నిధులకు సంబంధించిన అంశాల కోసమేనని చెప్పారు. కొండా సురేఖ వ్యవహారంపై చర్చించేందుకే తాను భట్టిని కలిశారన్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. తాను కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతను అని పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పోరాడానని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలిపారు.2018 ఎన్నికల్లో పలువురు కీలక కాంగ్రెస్ నేతలు ఓడిపోయినప్పటికీ మునుగోడు ప్రజలు తనను గెలిపించారని కోమటిరెడ్డి గుర్తుచేశారు. తెలంగాణలో ప్రతిపక్షమే లేకుండా చేయాలని ప్రయత్నించిన కేసీఆర్‌కు వ్యతిరేకంగా తాను పోరాడిన విషయాన్ని ప్రస్తావించారు. ఇతర పార్టీల నుంచి ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లోకి వచ్చిన వారికి ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ముందు నుంచి పార్టీ కోసం పనిచేసిన అసలైన కార్యకర్తలకు నష్టం జరగకూడదని తాను చెబుతున్నానని రాజగోపాల్ రెడ్డి అన్నారు. నిజాయితీగా ఉద్యమంలో పనిచేసిన నాయకులు, కార్యకర్తలను పార్టీ కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు.తాను పార్టీకి వ్యతిరేకంగా ఎప్పుడూ మాట్లాడలేదని తేల్చి చెప్పిన రాజగోపాల్ రెడ్డి వ్యక్తిగతంగా సీఎం రేవంత్ రెడ్డిని లేదా ఇతర కాంగ్రెస్ నేతలను విమర్శించలేదని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడం కోసమే తన అభిప్రాయాలను వెల్లడిస్తున్నానని తెలిపారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడమే తన లక్ష్యమని కాంగ్రెస్‌ను బలహీనపరిచేలా తాను ఎప్పుడూ వ్యవహరించబోనని స్పష్టం చేశారు.ఈ క్రమంలోనే తనపై దుష్ప్రచారం చేస్తున్న కొన్ని మీడియా సంస్థలపై కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మీడియా, జర్నలిస్టులంటే తనకు గౌరవం ఉందని చెబుతూనే కొందరు వ్యక్తులకు అనుకూలంగా పనిచేస్తూ తమ వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా వార్తలు ప్రచారం చేయడం సరికాదన్నారు. తనను, తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన నిజమైన నాయకులను కించపరిచేలా కథనాలు రాస్తే సహించేది లేదని వార్నింగ్ ఇచ్చారు. తమకు కూడా మీడియా సంస్థలను ఏర్పాటు చేసే సామర్థ్యం ఉందని వ్యాఖ్యానించారు. అయితే అన్ని మీడియా సంస్థలను తాను తప్పుబట్టడం లేదని, కొందరినే ఉద్దేశించి మాట్లాడుతున్నానని స్పష్టం చేశారు.

# పేదల సొంత ఇంటి కల కాంగ్రెస్ తో సాధ్యం

**- డిసిసి అధ్యక్షులు వజ్రేష్ యాదవ్**



**మేడ్చల్(ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ మేడ్చల్ పట్టణంలోని ఇందిరా నగర్ కాలనీలోని పానుగంటి సువర్ణ ఇందిరమ్మ ఇళ్లు నూతన గృహ ప్రవేశ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మేడ్చల్ డిసిసి అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ లబ్ధిదారులైన పానుగంటి సువర్ణ నూతన ఇందిరమ్మ ఇంటిలో గృహ ప్రవేశం నిర్వహించగా కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. పేదల సొంత ఇంటి కలను సాకారం చేయడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలు గ్రామీణ పట్టణ పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి తోటకూర వజ్రేష్ (జంగయ్య) యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో,టిపిసిసి సీనియర్ అధికార ప్రతినిధి,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డి ,మేడ్చల్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు మలిపెద్ది సుధీర్ రెడ్డి ,సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నడికొప్పు నాగరాజు (చాపరాజు) ముదిరాజ్ మేడ్చల్ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దుర్గం శివ శంకర్ ముదిరాజ్,మేడ్చల్ మాజీ జెడ్పిటిసి సభ్యులు సాయిపేట శ్రీనివాస్,మాజీ కౌన్సిలర్లు చీర్ల రమేష్ ,పానుగంటి సుహాసిని,కౌడె మహేష్ కురుమ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కనకాల శివ కుమార్ (బిపిటి రాజు),నడికొప్పు రంజిత్ ముదిరాజ్,రామన్నగారి రాఘవేందర్ గౌడ్,వేముల శ్రీనివాస్ రెడ్డి,కర్రె రాజేష్,కృష్ణా రెడ్డి,ఉదండపురం సత్యనారాయణ,బండి శ్రీనివాస్ గౌడ్,దుర్గం వెంకటేష్ ముదిరాజ్,మేకల రాజశేఖర్ రెడ్డి (బబ్లూ),పెగుడ శ్యాంరావ్,పిట్ల లక్ష్మణ్ ముదిరాజ్,రామన్నగారి సంతోష్ గౌడ్,పానుగంటి రవీందర్,సద్ది సుదర్శన్ రెడ్డి,ఘనపురం మల్లేష్,పత్తి శంకర్,ఆంజనేయులు,మేడ్చల్ మున్సిపాలిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లవంగు రాకేష్ వంజరి,మేడ్చల్ మున్సిపాలిటీ ఎన్ ఎస్ యూ ఐ అధ్యక్షులు గుండ శ్రీధర్ కురుమ,స్థానిక ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,యువకులు,మహిళలు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 15లోగా రెండో విడత

# లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి

విజ్ఞప్తి చేసినా ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా కేంద్రం నుంచి విడుదల కాలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రాంత ప్రజల ఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా 2014-23 వరకు దాదాపు పది సంవత్సరాలలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో పేదల ఇండ్ల నిర్మాణం జరగలేదు.దీంతో ఇండ్ల నిర్మాణానికి ప్రజల నుంచి భారీ ఎత్తున డిమాండ్ ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన ఇండ్లను మంజూరు చేయాలని అనేకమార్లు విజ్ఞప్తి చేయడం జరిగింది. కేంద్రం నుంచి నిధులు వస్తాయన్న నమ్మకంతో ఇప్పటివరకు పూర్తయిన ఇళ్లకు సంబంధించిన చివరి బిల్లుల చెల్లింపును తాత్కాలికంగా నిలిపివేయడం జరిగింది'అని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.

**పేదవాడి సొంతింటి కల నెరవేరుస్తాం** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీని, కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్‌లను పలుమార్లు కలిసి తెలంగాణకు ఇల్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు అని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గుర్తు చేశారు. 'రాష్ట్రానికి కేంద్ర మంత్రి వచ్చిన సందర్భంలో రెండు వారాల క్రితం పార్లమెంటు సభ్యులతో కలిసి నేను స్వయంగా కేంద్ర మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశాను. అయినప్పటికీ కేంద్రం నుంచి సానుకూల స్పందన రాలేదు. కేంద్రం నుంచి నిధులు వస్తాయని ఆశ పెట్టుకుని పేద ప్రజలను ఇంకా ఎన్నాళ్లు ఇబ్బంది పెట్టాలి? ఇల్లు పూర్తి చేసుకున్న లబ్ధిదారుడు చివరి బిల్లు కోసం ఎదురు చూస్తుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు. కేంద్రం తన బాధ్యత నిర్వర్తించకపోయినా పేదవాడి బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం నిర్వర్తిస్తుంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏమాత్రం సహకరించక పోయిన కూడా పేదల సొంతింటి కలను నెరవేర్చడాన్ని ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది'అని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

**ఇందిరమ్మ ఇంటికి రూ.5 లక్షలు సబ్సిడీ అందిస్తుంది** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకున్న 15,475 మంది లబ్ధిదారులకు రూ.185 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. మార్చి 31వ తేదీ వరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు చివరి బిల్లుల మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో గురువారం నాడు జమ అవుతాయని తెలిపారు. మిగిలిన వారికి కూడా విడతల వారీగా ఇస్తాం. ఇందులో ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని స్పష్టం చేశారు. దేశంలో మరే రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వని విధంగా ఇందిరమ్మ ఇంటికి రూ.5 లక్షల పూర్తి సబ్సిడీ అందిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

**సెప్టెంబర్15 లోగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి** పేద కుటుంబాలకు సురక్షితమైన, గౌరవప్రదమైన నివాసాన్ని కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, పేదలకు సొంతింటి కల నెరవేర్చడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సంకల్పమని, ఈ లక్ష్య సాధనలో కేంద్రం సానుకూలంగా స్పందిస్తుందనే ఆశతో ఇప్పటికీ ఉన్నామని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో గృహ నిర్మాణాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. పది సంవత్సరాలలో సంవత్సరానికి కనీసం పదివేల ఇండ్లను కూడా నిర్మించలేదు. పైగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక ఇల్లు కూడా తీసుకోలేదు. ఈ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన మా ప్రభుత్వం పేదల ఇండ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. గత ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, ఇప్పటివరకు సుమారు 2 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జూన్ 2న ఆదిలాబాద్‌లో ప్రారంభించారని, సెప్టెంబర్ 15లోగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేస్తామని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.

# ఫాస్టాగ్ నుంచి ట్రాఫిక్ చలాన్లు కట్

చలాన్ ఫైన్లను భారీగా పెంచినప్పటికీ భారీగా బకాయిలు పెరిగిపోతున్నాయి తప్ప వాహనదారులు ట్రాఫిక్ ఉల్లంఘనల తీరు మాత్రం మారడం లేదు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ నగర పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను పాటించని ట్రాఫిక్ చలాన్లు చెల్లించని వారి జేబులకు చిల్లు వేసేందుకు ట్రాఫిక్ పోలీసులు రెడీ అయ్యారు. ఒక వాహనంపై ఉన్న ట్రాఫిక్ చలాన్ల మొత్తాన్ని ఆ వాహనం ఫాస్టాగ్ అకౌంట్ నుంచి కట్ చేసే ప్రతిపాదనలు పరిశీలిస్తున్నారు.ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ఈ-చలాన్ల వసూళ్లను సులభతరం చేయడంతో పాటు ట్రాఫిక్ ఉల్లంఘనలను తగ్గించేందుకు ఫాస్టాగ్‌తో చలాన్ల వ్యవస్థను అనుసంధానం చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈ విధానం అమల్లోకి వస్తే ట్రాఫిక్ ఉల్లంఘనలకు విధించే జరిమానాను సంబంధిత వాహనదారుడి ఫాస్టాగ్ ఖాతా నుంచి ఆటోమేటిక్‌గా మినహాయించే అవకాశం ఉంటుంది. దీనివల్ల వాహనదారులు మరింత జాగ్రత్తగా ట్రాఫిక్ రూల్స్ పాటిస్తారని పోలీసులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్‌సీ) వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సన్‌ప్రీత్ సింగ్ ఈ ప్రతిపాదనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.ఫాస్టాగ్ ద్వారా ట్రాఫిక్ చలాన్ల వసూలు చేసే అంశంపై హెచ్‌ఎండీఏ అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. అయితే ఈ విధానం అమలుకు సంబంధించిన తుది నిర్ణయం, నిబంధనలు, సాంకేతిక అనుసంధానంపై ఇంకా అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఉల్లంఘనలను కెమెరాలు, ఇతర టెక్నాలజీ వ్యవస్థల ద్వారా గుర్తించి వాహనాలకు ఈ-చలాన్లను జారీ చేస్తున్నారు. అయితే చాలామంది వాహనదారులు జరిమానాలను చెల్లించకుండా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచుతున్నారని పోలీసులు గుర్తించారు. దీంతో చలాన్ల వసూళ్ల కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఫాస్టాగ్ వ్యవస్థతో ట్రాఫిక్ ఈ-చలాన్లను అనుసంధానం చేస్తే జరిమానా విధించిన తర్వాత నిర్దేశిత నిబంధనల ప్రకారం మొత్తాన్ని ఆటోమేటిక్‌గా వసూలు చేసే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. దీనివల్ల పెండింగ్ చలాన్ల సంఖ్య తగ్గడంతో పాటు, ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించే ముందు వాహనదారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించే అవకాశం ఉందని భావిస్తున్నారు.అయితే ఫాస్టాగ్ అనేది ప్రధానంగా ఫోర్ వీల్స్, ఆపైన భారీ వాహనాలకు మాత్రమే ఉంటుంది. కానీ బైక్‌లు, ఆటోలు వంటి వాహనాలకు ఫాస్టాగ్ ఉండదు. ఈ నేపథ్యంలోనే ఆ వాహనాలకు ఈ విధానం ఎలా వర్తిస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అలాగే ట్రాఫిక్ చలాన్ మొత్తాన్ని ఎప్పుడు కట్ చేస్తారు వాహనదారులకు ముందుగా సమాచారం ఇస్తారా తప్పుగా విధించిన చలాన్లపై అప్పీల్ చేసే అవకాశం ఉంటుందా వంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు రావాల్సి ఉంది. హైదరాబాద్‌లో పెరుగుతున్న వాహనాల సంఖ్య, ట్రాఫిక్ రద్దీ, అక్రమ పార్కింగ్, రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతంగా వినియోగించాలని అధికారులు భావిస్తున్నారు. ప్రజా రవాణాను బలోపేతం చేయడం, లాస్ట్‌మైల్ కనెక్టివిటీని మెరుగుపరచడం, ప్రధాన ప్రాంతాల్లో మల్టీ లెవల్ పార్కింగ్ సదుపాయాలను పెంచడం వంటి చర్యలు కూడా అవసరమని సన్‌ప్రీత్ సింగ్ సూచించారు.

# సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం


38 ఏళ్ల సుస్మిత ఏమైనా మాట్లాడే హక్కు ఆమెకు ఉందని అన్నారు. దాన్ని నియంత్రించే హక్కు, ప్రశ్నించే హక్కు తమకు లేదన్నారు. అలాగనే ఆమె తమ కుటుంబ సభ్యురాలు కాకుండా పోదని కామెంట్ చేశారు. ముఖ్యమంత్రిని కలుస్తారా అనే ప్రశ్నకు సూటిగా సమాధానం చెప్పకుండా దాట వేశారు. కవిత లాంటి వ్యక్తి బీఆర్ఎస్ నుంచి బయటకు వస్తే ఎవరైనా ప్రశ్నించారా అని నిలదీశారు. దాదాపు ఐదు నిమిషాలు మీడియాతో మాట్లాడిన కొండా మురళి, తన కుమార్తె వ్యాఖ్యలను ఖండించలేదు. వాటిని పూర్తిగా సమర్థిస్తున్నట్టే మాట్లాడారు. ఇలాంటి రిప్లైనే క్రమశిక్షణ కమిటీకి కొండ సురేఖ అందజేశారు. వాటిని పరిశీలించిన కమిటీ ఆమెపై చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసింది. దీనికి సంబంధించిన ప్రూఫ్స్‌ను కూడా జత చేసింది. మరోవైపు రేవంత్ వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు కూడా ఇలాంటి వాటిని ఉపేక్షించవద్దని డిమాండ్ చేస్తున్నారు. పదే పదే ఆమెతోపాటు కుటుంబ సభ్యులు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని, వీటికి ఫుల్‌స్టాప్ పెట్టాలంటే కచ్చితంగా కఠినమైన చర్యలు తీసుకోవాలని అంటున్నారు.సురేఖ తప్పించుకొని ఎక్కడికా పారిపోలేదని అన్నారు కొండా మురళి. జిల్లాలోనే తిరుగుతున్నారని చెప్పారు. సుస్మిత వ్యాఖ్యలపై క్రమశిక్షణ కమిటీకి చెప్పాల్సింది చెప్పామని అన్నారు. తమకు పూర్తి నమ్మకం ఉందని, కచ్చితంగా తనకు అనుకూలమైన నిర్ణయం వస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఈ విషయంలో సీరియస్‌గా ఉన్నట్టు సమాచారం. ఈ మధ్య జరిగిన ప్రెస్‌మీట్‌లో పీసీసీ చూసుకుంటుందని చెప్పినప్పటికీ ఆయన మాత్రం సుస్మిత చేసిన వ్యాఖ్యలు, కొండా సురేఖ వైఖరిపై గుర్రుగా ఉన్నారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. పదే పదే తనను టార్గెట్ చేసుకున్న వారికి షాక్ ఇవ్వాలంటే మాత్రం సురేఖ విషయంలో గట్టి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అంటున్నారట.

# వరదలకు నేపాల్ విలవిల

మంది విదేశీయులు, 93 మంది నేపాల్ జాతీయులతో సహా కనీసం 384 మంది ప్రయాణికులు గల్లంతయ్యారు. విదేశీయులలో 105 మంది భారత జాతీయులు ఉన్నారని అధికారులు తెలిపారు.రసువా జిల్లాలో కనీసం 26 మంది నేపాల్ పోలీసు సిబ్బంది ఇప్పటికే గల్లంతయ్యారని అధికారులు తెలిపారు. సాయుధ పోలీసు దళానికి చెందిన ఏడుగురు సిబ్బంది కూడా గల్లంతయ్యారు. వరద ప్రాంతాలకు నేపాల్ సైన్యం హెలికాప్టర్లను, విపత్తు సహాయక సిబ్బందిని పంపింది. ఈ వరదల ధాటికి రోడ్లు, విద్యుత్ మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి. అధికారులు విధ్వంసం తీవ్రతను అంచనా వేయడానికి ప్రయత్నిస్తున్నారు.వరదల కారణంగా నేపాల్ లో పలు జాతీయ రహదారుల్ని సైతం మూసేశారు. నేపాల్ పోలీసులు, స్థానికులు సోషల్ మీడియాలో వరద వీడియోల్ని షేర్ చేస్తున్నారు. వీటిలో టిబెట్ సరిహద్దు జిల్లాల్లోని హిమాలయ దేశంలో పర్వత లోయల గుండా బురద నీటి ప్రవాహాలు విరుచుకుపడుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. నది ఒడ్డున నివసిస్తున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లమని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. పరిస్థితిని సమీక్షించడానికి ప్రధాని బాలేంద్ర షా జాతీయ విపత్తు ప్రమాద తగ్గింపు , నిర్వహణ అథారిటీ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

## కోదాడ బస్సు ప్రమాదంపై

# సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి



అమరావతి(ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలోని కోదాడ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నుంచి ఏలూరు వస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, కంటైనర్‌ను ఢీకొన్న ఘటనలో ఆరుగురు మృతి చెందడం పట్ల ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఈ ప్రమాదంలో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు చెందిన పలువురు ప్రాణాలు కోల్పోగా, మరికొందరు తీవ్రంగా గాయపడినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మృతుల కుటుంబాలకు చంద్రబాబు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ప్రమాదం జరిగిన వెంటనే సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదానికి సంబంధించిన సహాయక చర్యలను నిరంతరం పర్యవేక్షిస్తూ, తెలంగాణ ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.ఏపీకి చెందిన ప్రయాణికుల పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి, బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయాన్ని అందించాలని అధికారులకు సూచించారు. ప్రమాద ఘటనపై పూర్తి వివరాలను తెలుసుకుని, సహాయక చర్యల్లో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని సీఎం స్పష్టం చేశారు.

## మూడు దశాబ్దాల

# వెలిగొండ కల సాకారం

- 31న సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభం
- నిర్వాసితుల త్యాగం వెలకట్టలేనిది.. వారికి పేరు పేరునా పాదాభివందనం మంత్రి నిమ్మల రామానాయుడు
- నిర్వాసితుల సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుంది



మార్కాపురం(ప్రశ్న న్యూస్) మూడు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు కల ఈ నెల 31న సాకారం కానుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టును ప్రారంభించనున్నారని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ ఏర్పాట్లను మంగళవారం రాత్రి మంత్రి పరిశీలించారు.ఫీడర్ కెనాల్‌లో సీఎం ప్రారంభించనున్న రెగ్యులేటర్ గేట్ల ఏర్పాటు పనులను పరిశీలించిన మంత్రి.. వెలిగొండ వద్ద ముఖ్యమంత్రి జలహారతి ఇచ్చే ఘాట్, స్థూపం, సభా వేదిక ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం నిర్వాసితుల కాలనీలను సందర్శించి మౌలిక వసతులపై కలెక్టర్, అధికారులతో సమీక్షించారు.

### 7 వేల కుటుంబాల త్యాగం

వెలిగొండ కోసం భూములు, ఆస్తులు త్యాగం చేసిన నిర్వాసితులకు పేరు పేరునా పాదాభివందనం చేస్తున్నానని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. సుమారు 7 వేల నిర్వాసిత కుటుంబాల త్యాగ ఫలితంగానే లక్షలాది ఎకరాలకు సాగునీరు, లక్షలాది మందికి తాగునీరు అందే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు.నిర్వాసితుల త్యాగం వెలకట్టలేనిదని.. వారి సంక్షేమానికి భవిష్యత్తులోనూ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. వెలిగొండ నుంచి నీరు అందడంతో రైతుల కళ్లలో కనిపించే ఆనందమే నిర్వాసితుల కుటుంబాల్లోనూ ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు.

### 40 రోజుల్లో రూ.768 కోట్లు

గత ప్రభుత్వం ఐదేళ్లపాటు నిర్వాసితులను మోసం చేసిందని మంత్రి విమర్శించారు. నిర్వాసితులకు సుమారు రూ.900 కోట్లు చెల్లించాల్సి ఉన్నా.. గత ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని ఆరోపించారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం 40 రోజుల్లోనే నిర్వాసితులకు రూ.768 కోట్లు చెల్లించామని తెలిపారు. ప్రతి ఫిర్యాదును పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని చెప్పారు.ఈ కార్యక్రమంలో మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం.విజయసునీత, జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, ఇరిగేషన్ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌ఛార్జి ఎరిక్షన్‌బాబు, వెలిగొండ ప్రాజెక్టు సీఈ రమేష్, ఎస్ఈ అబూతలేం, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన మిలాద్-ఉన్-నబీ వేడుకలు

**- పోలీసుల పటిష్ట బందోబస్తు.ప్రశాంతంగా ముగిసిన వేడుకలు**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మెదక్ జిల్లా వ్యాప్తంగా మిలాద్–ఉన్–నబీ వేడుకలు ప్రశాంత వాతావరణంలో ఘనంగా ముగిశాయి. మెదక్ టౌన్, చేగుంట, శంకరంపేట–ఏ, టేక్మాల్, నార్సింగి, నర్సాపూర్ పట్టణాలతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వేడుకలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జిల్లా పోలీసు యంత్రాంగం ముందస్తు ప్రణాళికతో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. వేడుకలు, ప్రార్థనలు, ఊరేగింపుల సందర్భంగా ప్రజల రాకపోకలు, ప్రధాన కూడళ్లు, ప్రార్థనా మందిరాలు, సున్నితమైన ప్రాంతాలు, ఊరేగింపు మార్గాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం పరిస్థితిని పర్యవేక్షించారు. ఊరేగింపుల సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా అవసరమైన ప్రాంతాల్లో నియంత్రణ చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాలు, మొబైల్ పెట్రోలింగ్, రూట్ మొబైల్ బృందాల ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించారు. మత సామరస్యం, పరస్పర గౌరవం, శాంతియుత వాతావరణాన్ని కాపాడుతూ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రజలకు జిల్లా పోలీసు శాఖ కృతజ్ఞతలు తెలిపింది. పోలీసులకు సహకరించిన మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల ప్రతినిధులు, నిర్వాహకులను అధికారులు అభినందించారు.జిల్లాలో అన్ని పండుగలను శాంతియుతంగా, సోదరభావంతో నిర్వహిస్తూ మెదక్ జిల్లా ప్రశాంతతకు ప్రజలు సహకరించాలని జిల్లా పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది.

# కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్‌వన్నీ కుట్రలేనని తేలింది

- ప్రాజెక్టును నిర్వీర్యం చేయాలని చూసిన రేవంత్‌రెడ్డి, దుద్దిళ్ల
- కేసీఆర్ ముందుచూపుతోనే తెలంగాణ దేశానికి దిక్సూచిగా నిలిచింది
- తండ్రి కొడుకుల పాలనలో ఒక్క చెక్‌డ్యాం..బ్రిడ్జి కట్టలేదని గుర్తించాలే
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినంకనే మళ్లీ వలసలు మొదలైనయ్
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**మంథని ( ప్రశ్న న్యూస్)** ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్‌గా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇన్ని రోజులు కాంగ్రెస్ పార్టీ చేసినవన్నీ కుట్రలేనని తేలిపోయిందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ స్పష్టం చేశారు. బుధవారం మంథని మండలం సిరిపురం గ్రామంలోని సుందిళ్ల బరాజ్‌లో తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి భూపాలపల్లి జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణీ తోకలిసి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేసీఆర్ నైపుణ్యతపై కాంగ్రెస్ పార్టీ మూడు సంవత్సరాలుగా చేసిన కుట్రలను వాటర్ పవర్ సెంట్రల్ రీసెర్చ్ స్టేషన్, ఎన్‌డీఎస్ఏ బృందం పటాపంచలు చేస్తూ హైకోర్టుకు నివేదికలు అందించిందని ఆయన తెలిపారు. కాళేశ్వరంపై చేసిన ఆరోపణలు ఏవీ నిజం కాదని నిర్ధారణ అయిందన్నారు. అతి పెద్ద ప్రాజెక్టును నిర్మించి అందుబాటులోకి తీసుకువస్తే రేవంత్‌రెడ్డి నిర్వీర్యం చేయాలని చూస్తుంటే మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ ముఖ్యమంత్రి అడుగులకు మడుగులు ఒత్తుతూ చూస్తు ఉండిపోయాడని ఆయన విమర్శించారు. తండ్రి కొడుకులు ఈ నియోజకవర్గంలో అనేక ఏండ్లు పాలించి ఒక్క చెక్ డ్యాం, ఒక్క బ్రిడ్జి కట్టలేదని, అదే కేసీఆర్ హయాంలో తాను ఎమ్మెల్యే ఉన్న సమయంలో బొక్కలవాగుపై చెక్‌డ్యాంలు, గోదావరిపై బ్రిడ్జిలు నిర్మించామని గుర్తు చేశారు. 150కిలో మీటర్ల విస్తీర్ణంలో నిండుకుండలా సముద్రాన్ని తలపించేలా ఉన్న గోదావరినదిని రేవంత్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌లు నిర్వీర్యం చేయాలని ఏడారిని తలపించేలా చేశారని ఆయన అన్నారు. ఇప్పటి వరకు దోచుకున్న కాడికి సరిపోతదని, వేల కోట్లు దోచుకున్నారని ఇప్పటికే జోరుగా ప్రచారం జరుగుతోందని, ఇప్పటకైనా దుద్దిళ్ల శ్రీధర్ కళ్లు తెరువాలన్నారు. ఆనాడు ప్రాజెక్టు ద్వారా మత్స్య సంపద పెరిగిందని, గ్రౌండ్ వాటర్ పెరిగి సాగు విస్తీర్ణం కూడా పెరిగిందని ఆయన వివరించారు. ఒకప్పుడు బతుకు దెరువు కోసం దుబాయ్‌లాంటి దేశాలకు వలసపోయిన బెస్తపల్లి వాసులు ప్రాజెక్టు నిర్మాణంతో మత్స్య సంపద పెరిగి ఇక్కడికే వచ్చారని, మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బరాజ్‌లో నీటిని నిల్వ చేయకపోవడంతో ఉపాది లేక వలసబాట పట్టారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టులో నీళ్లు నిలిపే అంశం ప్రభుత్వం మీద ఉందని దాన్ని మేం వ్యతిరేకిస్తలేమని సెంటర్ వాటర్ రిసెర్చ్ స్టేషన్, ఎన్‌డీఎస్ఏ బృందం చెప్తున్నా కానీ సుందిళ్ల బ్యారేజీకి ఏమీ కాకున్నా నీళ్లు ఆపకుండా నిర్వీర్యం చేయాలని మంథని ఎమ్మెల్యే చూశాడని అర్థం అవుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా ఇంకా ప్రజలపై మమకారం పెరుగడంలేదన్నారు. కేవలం ఢిల్లీకి మూటలు మోసుకుపోవడం తప్ప రాష్ట్ర ప్రయోజనాల గురించి ఆలోచించడం లేదని ఆయన విమర్శించారు. కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రయోజనాలు, ప్రతి వర్గం కోసం పని చేశారని, అందుకే మంచి ఫలితాలు వచ్చాయని గుర్తించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బరాజ్‌ల గేట్లు మూసి నీళ్లు ఆపాలని, లేనిపక్షంలో ప్రజలే నీళ్లు ఆపుకునే రోజులు వస్తాయని ఆయన హెచ్చరించారు.....

## తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (TOSS) పోస్టర్ ఆవిష్కరణ



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (TOSS) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ ూజ మరియు ఇంటర్మీడియట్ ప్రవేశాలపై రూపొందించిన ప్రచార పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ బుధవారం విద్యాశాఖాధికారి . రాజు , అడల్ట్ ఎడ్యుకేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మురళీమోహన్, విద్యాశాఖ కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ రాజు, మెదక్ జిల్లా ూూ కోఆర్డినేటర్ ఎ.వరప్రసాద్, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అవకాశాన్ని చదువు మధ్యలో మానేసిన 14 సంవత్సరాలు పైబడిన విద్యార్థుల కు మరియు యువతి యువకులకు చక్కని అవకాశం కాబట్టి వినియోగించుకోవాలని అన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన గ్రామ సర్పంచ్ స్వప్న ఉశయ్య



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన బిజెపి పార్టీ సీనియర్ నాయకులు వడ్ల వెంకటేశం రాజమణి ద్వితీయ పుత్రుడు అనిల్ చారి మరియు ఇందు వివాహ వేడుకలు ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ జరిగింది ఈ వివాహ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కిష్టాపూర్ గ్రామ సర్పంచ్ సాదుల స్వప్న ఉషయ్య మరియు బిజెపి పార్టీ మెదక్ జిల్లా కౌన్సిల్ మెంబర్ ఎంచర్ల శేఖర్ యాదవ్ పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన వధూవరులను నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో హాయిగా మీ దాంపత్య జీవితాన్ని ఇలాగే కొనసాగాలని వారు దంపతులను దీవించారు ఈ వివాహ కార్యక్రమం పాల్గొన్నవారు కిష్టాపూర్ గ్రామ ఉపసర్పంచ్ సందపురం నిర్మల శేఖర్ యాదవ్, వార్డు మెంబర్ ఏంబరి మల్లేశం యాదవ్, జుర్రు సిద్ధ రాములు, ఏంబరి శీను, వడ్ల బ్రహ్మచారి, తదితరులు పాల్గొన్నారు.

## ఆది వరాహస్వామిని దర్శించుకున్న మంథని కోర్టు ఏపీపీ



**మంథని ( ప్రశ్న న్యూస్)** మంథని కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అర్ధ కుమార్– హాసిని దంపతులు బుధవారం కమాన్పూర్ లోని ఆదివార స్వామి దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు పండితులు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టిన అనంతరం ఏపీపీకి దేవుని ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ముస్త్యాల దామోదర్, ఎస్ ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

## కులగణన అంశంపై ఓబీసీల హక్కుల కోసం గళమెత్తిన ఖర్గే రాహుల్ గాంధీలకు అభినందనలు

**- టిజిఎస్ రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర**



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) దేశంలో కులగణనను శాస్త్రీయంగా సమగ్రంగా నిర్వహించాల్సిన అవసరాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ ద్వారా స్పష్టంగా తెలియజేసిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీలను తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర అభినందించారు.ప్రస్తుత కులగణన విధానంలో వెనుకబడిన వర్గాలు (ఓ బి సి) అనే పదాన్నే చేర్చకపోవడం ఆందోళనకరమైన అంశమని దీనివల్ల దేశంలో ఓబీసీల వాస్తవ జనాభా ఎంత అన్నది కచ్చితంగా తెలుసుకునే అవకాశం దెబ్బతినే ప్రమాదం ఉందని ఖర్గే రాహుల్ గాంధీ ప్రధానికి రాసిన లేఖలో ప్రస్తావించారన్నారు.ఒకే కులానికి ప్రాంతాలను బట్టి వేర్వేరు పేర్లు ఉపకులాలు భాషాపరమైన పేర్లు ఉండే అవకాశం ఉన్నందున ఓపెన్ ఎండెడ్ విధానానికి బదులుగా కులాల ప్రామాణిక జాబితాను రూపొందించి డ్రాప్‌డౌన్ విధానంలో వివరాలు సేకరించాలని వారు సూచించడం స్వాగతించదగిన విషయమని రాజేష్ ఖన్నా గంగపుత్ర పేర్కొన్నారు.ఓబీసీ వర్గాల సామాజిక ఆర్థిక విద్యా పరిస్థితులను అర్థం చేసుకోవడానికి కచ్చితమైన జనాభా గణాంకాలు ఎంతో అవసరం సామాజిక న్యాయం విద్య ఉద్యోగాలు రిజర్వేషన్లు సంక్షేమ పథకాల రూపకల్పనకు సరైన కులగణన కీలకం ఈ అంశాన్ని జాతీయ స్థాయిలో బలంగా ప్రస్తావించిన మల్లికార్జున ఖర్గే రాహుల్ గాంధీలకు తెలంగాణ గంగపుత్ర సంఘం తరఫున హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాం అని రాజేష్ ఖన్నా గంగపుత్ర అన్నారు.తెలంగాణ బీహార్ కుల సర్వేలలో అనుసరించిన విధానాలను పరిగణనలోకి తీసుకుని అన్ని వెనుకబడిన వర్గాలకు న్యాయం జరిగేలా సమగ్రంగా కులగణన నిర్వహించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

## ఇరుముడి' చిత్రీకరణపై ఉపాధ్యాయుల ఆగ్రహం



**మేడ్చల్( ప్రశ్న న్యూస్)** ప్రస్తుతం థియేటర్లలో నడుస్తున్న 'ఇరుముడి' సినిమాలో ప్రభుత్వ పాఠశాలలు,ఉపాధ్యాయులను అత్యంత ప్రతికూలంగా చిత్రీకరించడంపై ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. సినిమాలో చూపించిన సన్నివేశాలు ప్రభుత్వ విద్యావ్యవస్థపై తప్పుడు అభిప్రాయాన్ని కలిగిస్తాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.'సృజనాత్మక స్వేచ్ఛ' పేరుతో విద్యావ్యవస్థను కించపరిచేలా కథాంశాన్ని రూపొందించడం సరికాదని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. సృజనాత్మకత అంటే ఒక వర్గాన్ని, ఒక వ్యవస్థను అవమానించడం కాదని వారు స్పష్టం చేస్తున్నారు. సినిమాలో చూపించిన పాఠశాల వాతావరణం, హాస్టల్ దృశ్యాలు వాస్తవ ప్రభుత్వ పాఠశాలలను పోలి ఉండటంతో విద్యార్థుల్లో తప్పుడు భావనలు ఏర్పడతాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఆశాకిరణంగా నిలుస్తున్నాయని ఉపాధ్యాయులు గుర్తు చేస్తున్నారు.

కొంతమంది వ్యక్తుల ప్రవర్తనను మాత్రమే ఆధారం చేసుకుని మొత్తం ఉపాధ్యాయ వృత్తిని నిందించడం అన్యాయమని వారు వాదిస్తున్నారు. సినిమా అనేది సామాజిక ప్రభావం చూపే శక్తివంతమైన మాధ్యమం కావడంతో నిర్మాతలపై సామాజిక బాధ్యత ఉండాలని వారు పేర్కొంటున్నారు. ఉపాధ్యాయుడిని అవమానించడం అంటే విద్యను అవమానించడమే అని వారు స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సినిమా యూనిట్ విషయాన్ని పునఃపరిశీలించాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. తమ వృత్తి గౌరవాన్ని కాపాడుతూ సినిమా రూపకర్తలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మల్లికార్జున స్వామి భ్రమరాంబ దేవి హుండీల లెక్కింపు

**శ్రీశైలం.** హుండీల లెక్కింపు ద్వారా దేవస్థానానికి రూ. 5,88,89,846/–లు నగదు రాబడిగా లభించింది. కాగా ఈ హుండీల రాబడిని భక్తులు గత 35 రోజులలో ( 22.07.2026 నుండి 25.08.2026 వరకు) సమర్పించడం జరిగింది. అలాగే ఈ హుండీలో 87 గ్రాముల 200 మిల్లీగ్రాముల బంగారు, 4 కేజీల 250 గ్రాముల వెండి లభించాయి. అదేవిధంగా 540 – యుఎస్ఏ డాలర్లు, 1610? యు.ఏ.ఇ దిర్హామ్స్, 20 – సింగపూర్ డాలర్లు, 140 ? ఇంగ్లాండు పౌండ్స్, 21 ? మలేషియా రింగిట్స్, 10 ? సౌదీరియాల్స్, 109– బహ్రైన్ దినార్, 100 ? ఓమన్ బైసా, 5 ? ఓమన్ రియాల్స్ మొదలైనవి ఈ హుండీల లెక్కింపులో లభించాయి.

పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాల నిఘాతో ఈ లెక్కింపును చేపట్టడం జరిగింది. ఈ హుండీల లెక్కింపును ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు , ధర్మకర్తల మండలి సభ్యులు కె. కాంతివర్ధిని పర్యవేక్షించారు. అదేవిధంగా హుండీల లెక్కింపులో పలువిభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, దేవస్థానం సిబ్బంది శివసేవకులు పాల్గొన్నారు.

# వెలిగొండ చంద్రబాబు కష్టానికి ప్రతిఫలం

**- పదవులు శాశ్వతం కాదు.. - ప్రజలకు చేసిన అభివృద్ధే శాశ్వతం**

**- స్థానిక ఎన్నికల్లో జగన్ రాజకీయ భవిష్యత్తుకు ప్రజలే సమాధానం చెబుతారు: దేవినేని ఉమ**




**విజయవాడ(ప్రశ్న న్యూస్)** మూడు దశాబ్దాలుగా ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన కృషి, పట్టుదలకు వెలిగొండ ప్రాజెక్టు ప్రతిఫలమని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. పదవులు శాశ్వతం కావని.. ప్రజలకు చేసిన అభివృద్ధి మాత్రమే చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. గొల్లపూడిలోని తన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

### అభివృద్ధే ప్రజలకు గుర్తుండేది

ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి బాధ్యతను విస్మరించి ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడటం సరికాదని దేవినేని ఉమ విమర్శించారు. జగన్ ఐదేళ్ల పాలనలో చోటుచేసుకున్న పరిణామాలను ప్రజలు ఇంకా మరిచిపోలేదన్నారు. ఆ పాలనపై వెలువడిన పుస్తకాలను ఒకసారి చదువుకోవాలని సూచించారు. 48 ఏళ్ల రాజకీయ అనుభవంతో చంద్రబాబు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆదర్శంగా నిలుస్తుంటే.. జగన్ చేస్తున్న రాజకీయ విమర్శలు, పిల్లచేష్టలను ప్రజలు గమనిస్తున్నారని ఎద్దేవా చేశారు.

### పులివెందులకు నీళ్లు ఎవరివల్ల.?

పులివెందులకు నీళ్లు ఎవరు ఇచ్చారు.. అవి ఎలా వచ్చాయో అక్కడి రైతులను, ప్రజలను అడిగితే వాస్తవాలు తెలుస్తాయని అన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో సాగునీటి, వ్యవసాయ రంగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆరోపించారు. బీసీల విషయంలో గతంలో వ్యవహరించిన తీరును మరిచిపోయి ఇప్పుడు కపట ప్రేమ చూపిస్తూ నీతులు చెప్పడం జగన్‌కే చెల్లిందని విమర్శించారు. డీఎస్సీ నియామక ప్రక్రియపై జగన్ చేసిన విమర్శలను ఉపాధ్యాయులు తిప్పికొట్టారని దేవినేని ఉమ పేర్కొన్నారు. ఉమ విమర్శించారు. ఐదేళ్ల పాలనను ప్రజలు మరిచిపోయారన్నట్లుగా ఇప్పుడు ఏకగ్రీవాల గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. అభివృద్ధిని అడ్డుకున్న జగన్ రాజకీయాలకు ప్రజలు చరమగీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జగన్ రాజకీయ భవిష్యత్తుకు ప్రజలే సమాధానం చెబుతారని దేవినేని ఉమ స్పష్టం చేశారు.

# బంగారం ఒంటరిగా మోసుకెళ్లొద్దు

**- మహిళలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలి..**

**- నిర్మానుష్య ప్రాంతాల్లో ప్రయాణించొద్దు: ఎస్పీ మహేశ్వరరెడ్డి**



శ్రీకాకుళం(ప్రశ్న న్యూస్) బంగారు ఆభరణాలు ధరించి బయటకు వెళ్లే సమయంలో మహిళలు, వృద్ధులు మరింత అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వరరెడ్డి సూచించారు. అవసరం లేకుండా అధిక మొత్తంలో బంగారు ఆభరణాలు ధరించి ఒంటరిగా ప్రయాణించవద్దని హెచ్చరించారు. శుభకార్యాలు, వేడుకలకు వెళ్లే సమయంలో కుటుంబ సభ్యులు లేదా నమ్మకమైన వ్యక్తులతో కలిసి వెళ్లాలని సూచించారు. నిర్మానుష్య ప్రాంతాల్లో ఒంటరిగా ప్రయాణించకుండా, ఆభరణాలను బహిరంగంగా ప్రదర్శించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.

### అనుమానాస్పద కదలికలపై నిఘా

తమ చుట్టుపక్కల అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలను గమనిస్తే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీప పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. అనుమానాస్పద పరిస్థితుల్లో అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా చోరీలు, గొలుసు దొంగతనాలను ముందుగానే నివారించవచ్చున్నారు.

### అత్యవసరమైతే 112కు ఫోన్

అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్ 112కు సమాచారం అందించాలని ఎస్పీ తెలిపారు. ప్రజల భద్రతకు పోలీసు శాఖ నిరంతరం అందుబాటులో ఉంటుందని, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండటం ద్వారా నేరాలకు అవకాశం లేకుండా చేయవచ్చని సూచించారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ గోడ

# ధ్వంసం చేసి సిబ్బందిపై బెదిరింపులు





**రుద్రవరం.** రుద్రవరం మండలం ఆలమూరు గ్రామమునకు చెందిన మాతం(మఠం) అశోక్ కుమార్ అను వ్యక్తి ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రమునకు పొరుగున నివాసం ఉంటున్నాడు. అతని ఇంటికి రాకపోకల విషయంలో ఇబ్బందిగా ఉందని, తన ఇంటికి వెళ్ళడానికి సరైన దారి లేదని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రమునకు నైరుతి దిక్కున ఉన్న ప్రహరి గోడను ధ్వంసం చేసి, స్వయంగా దారి ఏర్పాటు చేసుకున్నాడు. విషయం తెలిసిన వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు మరియు ఆరోగ్య సిబ్బంది అంతా కలిసి అతనిని పిలిపించి "నీవు దౌర్జన్యంగా ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేయడం మరియు అక్రమంగా ఆరోగ్య కేంద్రం నుంచి నీ సొంత అవసరాల నిమిత్తం దారి ఏర్పాటు చేసుకోవడం చట్టరీత్యా నేరమవుతుందని హెచ్చరించి, ధ్వంసం చేసిన ప్రహరీ గోడను పునర్ నిర్మించి ఇవ్వమని" అడిగారు. అతను మొదట్లో ఆరోగ్య కేంద్రం సిబ్బందితో సానుకూలంగా సామరస్యంగా మాట్లాడి పడగొట్టిన గోడను పునర్నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చాడు. అందువల్ల ఇంతవరకు ఆరోగ్య సిబ్బంది అతనితో మర్యాదపూర్వకంగానే ఉంటున్నారు. కానీ అతను ఆరోగ్య కేంద్రం ప్రహరీ గోడ పడగొట్టి నెలరోజులపైగా అవుతున్న ఆ గోడను తిరిగి పునర్నిర్మించి ఇవ్వక నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడు పైగా ఆరోగ్య కేంద్రం గురించి మరియు ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది గురించి దుష్ప్రచారం చేస్తున్నాడు. మరియు పదేపదే ఆరోగ్య కేంద్రానికి వచ్చిసిబ్బంది విధులకు ,ఆటంకం కలిగిస్తున్నాడు. అంతే కాకుండానేను శారీరక వికలాంగుడిని,నన్ను మీరు ఇబ్బందులకు గురి చేస్తున్నారని తిరిగి మీ మీద కేసులు పెడతానని బెదిరిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు రుద్రవరం మండల ఎం. అర్. ఓ మరియు రుద్రవరం పోలీస్ స్టేషన్ ఎస్ఐ దృష్టికి ఈ విషయం తీసుకొని వెళ్తే వారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శించి పడగొట్టబడిన ప్రహరీ గోడను చూసి తమ వద్ద ఉన్న రికార్డులను పరిశీలించిన తర్వాత అతని మీద తగు చర్యలు తీసుకుంటామని ఆరోగ్య సిబ్బందికి హామీ ఇచ్చి వెళ్లారు.

# పిఠాపురానికి ఆధ్యాత్మిక అభివృద్ధి హారం

**- రూ.30.66 కోట్లతో ఆలయాలు, భజన మందిరాలు, కల్యాణ మండపాల అభివృద్ధి**

**- 24 దేవాలయాలకు రూ.17.06 కోట్లు.. 48 భజన మందిరాలకు రూ.11.60 కోట్లు**

**- లక్షలాది భక్తులకు మెరుగైన వసతులే లక్ష్యం**



**పిఠాపురం(ప్రశ్న న్యూస్)** ఆధ్యాత్మికతకు నిలయంగా, చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలిచిన పిఠాపురం అభివృద్ధి బాటలో మరో ముందడుగు వేస్తోంది. పురాతన ఆలయాల పరిరక్షణతో పాటు భక్తులకు ఆధునిక వసతులు కల్పించేలా భారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక చొరవతో పిఠాపురం నియోజకవర్గంలో ఆలయాలు, భజన మందిరాలు, కల్యాణ మండపాల అభివృద్ధికి మొత్తం రూ.30.66 కోట్ల నిధులు కేటాయించారు. ఆధ్యాత్మికత ఉన్న చోట అభివృద్ధి.. చరిత్ర ఉన్న చోట పరిరక్షణ.. సంస్కృతి ఉన్న చోట మరింత శోభ అనే లక్ష్యంతో చేపడుతున్న పనులు నియోజకవర్గవ్యాప్తంగా వేగంగా కొనసాగుతున్నాయి.



### 24 ఆలయాలకు రూ.17.06 కోట్లు

నియోజకవర్గంలోని 24 ప్రముఖ దేవాలయాల అభివృద్ధికి రూ.17.06 కోట్లు కేటాయించారు. ఆలయాల పునరుద్ధరణ, మరమ్మతులు, నిర్మాణ పనులతో పాటు భక్తులకు అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నారు..గొల్లప్రోలు సీతారామస్వామి ఆలయంలో ప్రాకార మండపం నిర్మాణం తుది దశకు చేరుకుంది. కొత్తపల్లిలోని జగన్నాథ, సత్యనారాయణ స్వామి ఆలయాల్లో ధ్వజస్తంభాల ప్రతిష్ఠాపన పనులు పూర్తయ్యాయి. పిఠాపురం కొత్తపల్లి వీధిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకుల క్వార్టర్ల స్లాబ్ పనులు పూర్తయ్యాయి.

శ్రీ కుంతీమాధవస్వామి ఆలయంలో కాలక్షేప మండపం, రామకృష్ణాపురంలోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో రాజగోపురం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. కుక్కుటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ.5 కోట్లు, శ్రీపాద శ్రీవల్లభ దేవస్థానానికి రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయి. చరిత్రను కాపాడుతూ.. ఆధ్యాత్మికతను పెంపొందిస్తూ.. ఆధునిక సౌకర్యాలను అందిస్తూ పిఠాపురం కొత్త అభివృద్ధి అధ్యాయానికి శ్రీకారం చుడుతోంది.

# అన్నప్రసాదం ప్రైవేటీకరణ అవాస్తవం

**- దేవస్థానం ఆధ్వర్యంలోనే అన్నప్రసాద వితరణ..**

**- ఆధునిక వంటశాలలతో రూ.36.82 లక్షల ఆదా**



విజయవాడ(ప్రశ్న న్యూస్) ఇంద్రకీలాద్రిపై భక్తులకు అందించే నిత్యాన్నప్రసాదం పంపిణీని ప్రైవేటు సంస్థకు అప్పగిస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారం అవాస్తవమని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం స్పష్టం చేసింది. అన్నప్రసాదం తయారీ, పంపిణీ, నాణ్యత పర్యవేక్షణ, మెనూ తదితర వ్యవహారాలన్నీ దేవస్థానం ఆధ్వర్యంలోనే కొనసాగుతాయని పేర్కొంది. భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో మరింత పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన, రుచికరమైన అన్నప్రసాదాన్ని వేగంగా అందించేందుకు ఆధునిక స్టీమ్ ఆధారిత మెకనైజ్డ్ కిచెన్ ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వంట ప్రక్రియలో పరిశుభ్రత ప్రమాణాలు పెంచడంతో పాటు ఆహార వృథాను తగ్గించడం, మానవ ప్రమేయాన్ని పరిమితం చేయడం ఈ ఆధునిక వంటశాల ప్రధాన ఉద్దేశమని వివరించారు.

### రూ.36.82 లక్షలు ఆదా

మెకనైజ్డ్ కిచెన్ పరికరాల సరఫరా, ఏర్పాటు కోసం ఒక సంస్థ రూ.2,31,82,668ను కోట్ చేయగా.. దేశవ్యాప్తంగా భారీ స్థాయిలో వంటశాలల నిర్వహణలో అనుభవం ఉన్న హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్/అక్షయపాత్ర ఫౌండేషన్ అదే తరహా పరికరాలను రూ.1.95 కోట్లకే ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చినట్లు దేవస్థానం తెలిపింది. దీంతో దేవస్థానానికి రూ.36,82,668 ఆదా అవుతుందని పేర్కొంది.



ఈ ప్రతిపాదనను ధర్మకర్తల మండలి పరిశీలించి ఆమోదించిందని, అనంతరం ప్రభుత్వం కూడా అనుమతి మంజూరు చేసిందని అధికారులు తెలిపారు.

### పరికరాల ఏర్పాటు వరకే..

అక్షయపాత్ర ఫౌండేషన్ పరిధి రోజుకు సుమారు 10 వేల మందికి సరిపడే ఆహార తయారీకి అవసరమైన ఆధునిక స్టీమ్ కుకింగ్ పరికరాలు, స్టెయిన్‌లెస్ స్టీల్ ఇన్సులేటెడ్ పాత్రలు, యుటిలిటీ వ్యవస్థల ఏర్పాటు, కమిషనింగ్, దేవస్థాన సిబ్బందికి సాంకేతిక శిక్షణ అందించడానికే పరిమితమని స్పష్టం చేసింది. అన్నప్రసాదం తయారీ, పంపిణీ, పర్యవేక్షణ బాధ్యతలను ప్రైవేటు సంస్థకు అప్పగించలేదని పేర్కొంది. మొత్తం ప్రక్రియ దేవస్థాన ఇంజనీరింగ్ విభాగం సాంకేతిక పర్యవేక్షణలోనే జరుగుతుందని తెలిపింది.

### రూ.6 కోట్ల భారం ఎక్కడిది?

అన్నప్రసాదం ప్లేట్లకు నిర్దిష్ట మొత్తాన్ని చెల్లించడం ద్వారా దేవస్థానంపై ఏటా రూ.6 కోట్ల అదనపు భారం పడుతుందన్న ప్రచారాన్ని అధికారులు ఖండించారు. అటువంటి నిర్వహణ లేదా పంపిణీ కాంట్రాక్టును ఎవరికి ఇవ్వలేదని స్పష్టం చేశారు. సంస్థలు సాంకేతిక ప్రతిపాదనల్లో పేర్కొన్న అంచనాలను ఆధారంగా చేసుకుని జరుగుతున్న ప్రచారానికి వాస్తవ ఆధారం లేదని తెలిపారు. భక్తులకు అత్యున్నత నాణ్యతతో అన్నప్రసాదం అందించడమే లక్ష్యంగా ఆధునిక వంటశాలను ఏర్పాటు చేస్తున్నామని, దీనిపై ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న అసత్య ప్రచారాన్ని భక్తులు నమ్మవద్దని దేవస్థానం విజ్ఞప్తి చేసింది.

## భక్తిశ్రద్ధలతో ముస్లిం సోదరులు

# మిలాదు న్నబి ఘనంగా వేడుకలు

**- ముస్లిం సోదరులకు అల్లాహ మార్గంలో నడవాలి**

**- సోదరులకు అల్లాహ దారి చూపాలి**



**కౌతాళం** ముస్లిం సోదరులు ప్రవక్త సొల్లెల్లాహు అలైహి వసల్లం మొహమ్మద్ రసూలిల్లాహు వారి మార్గంలో నడవాలని వారు సూచించిన ఐదు పూటల నమాజ్ ను ప్రతి ఒక్కరు ఆచరించాలని మానవ మనుగడకు అందరూ కలిసి ఉండాలని అల్లాహ మార్గములో నడుస్తూ ఇతరులకు ప్రవక్త దారి చూపాలని ప్రతి రోజు పండుగ లా మసీదును ఆచరించాలని మీ చేస్తున్న నమాజు, మంచిపని దర్మం,ఇతరులకు సహాయం కుటుంబం లో ఆరోగ్యం, మంచి మనసు,సిరి సంపదలు ఆ ప్రవక్త ఇవ్వాలని మీలాదున్నబి కమిటీ సభ్యులు హర్షద్ పేర్కొన్నారు. బుధవారం మిలాద్ ఉన్ నబి మహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం ప్రవక్త జన్మదిన సందర్భంగా మిలాద్ ఉన్ నబీ కమిటీ సభ్యులు వారి ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మసీద్ లను ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో ప్రవక్త జెండాలతో అలంకరించారు. 4:30 గంటలకు అసర్ నమాజు అనంతరం జెండా జూలూస్ నిర్వహించారు. ఈ ఊరేగింపులో మక్కా,మదీనా ప్రతిమలు ట్రాక్టర్లు లో ఎంతో చూడ చక్కగా పూలు, విద్యుత్ దీపాలు అలంకరించారు. సోదరులు జెండా చేత పట్టుకొని జామియా మసీద్ నుండి దర్గా వైపు మరియు బిస్మిల్లా సర్కిల్ మీదుగా పాత బస్టాండ్ బుడ్డప్ప షాప్ మీదుగా పురా విధుల్లో ఊరేగింపు గా వెళ్లారు. ఈ వేడుకల్లో ముస్లిం సోదరులు నారే తక్బీర్ అల్లాహ్ అక్బర్ అంటూ నినాదాలు చేశారు. మొహమ్మ ద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా ప్రత్యేక ఫాతిహాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో మక్కా మదీనా ప్రతిమలు గ్రామ ప్రజలను అలరించాయి. ఏడు గంటలకు మాగ్రిబ్ నమాజ్ అనంతరం మసీదులో ప్రత్యేక ఫాతిహాలు నిర్వహించి అల్లాహ్ తబురుక్ ముస్లిం సోదరులకు పంచిపెట్టారు. అనంతరం భోజన వసతి కల్పించారు. ఈ వేడుకల్లో మోలి ఉశేన్ వాలి, మొహమ్మద్ ముత్తాలి, రాజహమ్మద్, టైలర్ బాషా లంబు కాజ పాల్గొన్నారు.

## సిపిడిసిఎల్ ప్రాంతీయ సదస్సును

# జయప్రదం చేయండి

**- సిపిడిసిఎల్ వైస్ చైర్మన్ పి. శ్రీనివాసరావు పిలుపు**

**- నరసరావుపేటలో గోడ పత్రికల ఆవిష్కరణ**



**నరసరావుపేట :** ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ వర్కర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 29న విజయవాడ గాంధీనగర్ హనుమంతరాయ గ్రంధాలయం లో జరగనున్న సిపిడిసిఎల్ ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయాలని బుధవారం నరసరావుపేట పట్టణం లోని 220కేవీ విద్యుత్ కేంద్రం లో సీపీడీసీల్ వైస్ చైర్మన్ పి. శ్రీనివాసరావు అధ్యక్షతన సంబంధిత గోడ పత్రిక ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉన్న 9సంఘాలతో జేఏసీ గా ఏర్పడి కార్యాచరణ ను ఏర్పాటు చేయడం జరిగింది. కార్యాచరణ లో భాగంగా సీపీడీసీల్ సదస్సు విజయవాడ లో ఏర్పాటు చేయడం జరిగింది అని అన్నారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులందరిని సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, దళారీ విధానాన్ని రద్దు చేసి తెలంగాణ తరహాలో సంస్థలో విలీనం చేసుకోవాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ 10 లక్షలు ఇవ్వాలని కార్మికులకు ఏదైనా ప్రమాదం సంభవిస్తే ప్రమాద బీమా కింద కోటి రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. విజయవాడలో జరుగు సదస్సుకు కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో దర్శి రాజు,పవన్ కుమార్, శివ, పోలేష్, గోపి, కోటి రామకృష్ణ, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు

# వెంటనే చెత్తను తొలగించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

**సమస్య పరిష్కరించకపోతే జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద నిరసన: ఎర్రం శ్రీనివాస్**

**ఉప్పల్‌లో చెత్త డంపింగ్‌తో రోడ్లపై దుర్గంధం వెంటనే సమస్య పరిష్కరించాలి**





ఉప్పల్ ( ప్రశ్న న్యూస్ )మేడ్చల్–మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో డీమార్ట్ సమీపంలోని చెత్త డంపింగ్ కేంద్రం వద్ద చెత్త పేరుకుపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు.గత నాలుగైదు రోజులుగా ఇంటింటి నుంచి చెత్తను సేకరించే వాహనాలు చెత్తను డంపింగ్ కేంద్రానికి తరలించి, అక్కడి ప్రదేశంతో పాటు రోడ్లపైనా భారీగా చెత్తను పోస్తున్నారని తెలిపారు. ఈ మార్గంలో ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు, బాటసారులు రాకపోకలు సాగిస్తుంటారని పేర్కొన్నారు.ఇటీవల కురిసిన వర్షాలతో చెత్త తడిసి రోడ్లపై పేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతోందని, దోమల బెడద కూడా పెరిగిందని తెలిపారు. ప్రజల ఆరోగ్యం, పారిశుధ్య పరిస్థితులపై అధికారులు, పాలకులు తక్షణమే స్పందించాలని ఎర్రం శ్రీనివాస్ డిమాండ్ చేశారు.విశ్వ నగరంలో రోడ్లపై చెత్త సమస్యను ఎవరు పరిష్కరిస్తారు? అని ప్రశ్నిస్తూ, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. వెంటనే చెత్తను తొలగించి, రోడ్లపై చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు.సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపడతామని ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్ హెచ్చరించారు.

# మహమ్మద్ సుల్తాన ఉమర్‌కు గౌరవ డాక్టరేట్.. మదర్ థెరిస్సా సేవా రత్న అవార్డు

గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )సమాజంలోని నిరుపేదలు, అణగారిన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్న సోషల్ రిఫార్మేషన్ ఫౌండేషన్ అధ్యక్షురాలు, సామాజిక ప్రజాసేవకురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్ కు అరుదైన గౌరవం లభించింది.ఆమె సామాజిక సేవలను గుర్తిస్తూ న్యూ లైఫ్ థియాలాజికల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 'డాక్టర్ ఆఫ్ సోషల్ మినిస్ట్రీ' గౌరవ డాక్టరేట్ను ప్రదానం చేశారు. అలాగే మదర్ థెరిస్సా సేవా రత్న అవార్డుతో పాటు బంగారు పతకం అందజేసి ఘనంగా సత్కరించారు.బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మహమ్మద్ సుల్తాన ఉమర్‌కు ఈ గౌరవాలను అందజేశారు.ఈ సందర్భంగా న్యూ లైఫ్ థియాలాజికల్ యూనివర్సిటీ చైర్మన్ బిషప్ డాక్టర్ జోసెఫ్ పలంగి మాట్లాడుతూ.. సామాజిక సేవనే జీవిత లక్ష్యంగా ఎంచుకున్న మహమ్మద్ సుల్తాన ఉమర్ పేదలు, నిరుపేద కుటుంబాలు, అణగారిన వర్గాలకు తన వంతు సహాయాన్ని అందిస్తూ నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని తెలిపారు.

ఆమె సేవలను గుర్తించి యూనివర్సిటీ తరపున గౌరవ డాక్టరేట్‌తో పాటు మదర్ థెరిస్సా సేవా రత్న అవార్డు, బంగారు పతకంతో సత్కరించినట్లు పేర్కొన్నారు. మానవ సేవకు జీవితాన్ని అంకితం చేసిన మదర్ థెరిస్సా పేరుతో లభించిన ఈ పురస్కారాలు తనపై మరింత బాధ్యతను పెంచాయని ఆయన అన్నారు. అనంతరం మహమ్మద్ సుల్తాన ఉమర్ మాట్లాడుతూ..

"గౌరవాలు, అవార్డులు వ్యక్తిగతంగా నాకు దక్కినవిగా భావించడం లేదు. సమాజం కోసం సేవ చేస్తున్న ప్రతి ఒక్కరికీ దక్కిన గుర్తింపుగా భావిస్తున్నాను. ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం, పేదల జీవితాల్లో చిన్న మార్పు తీసుకురావడమే నా లక్ష్యం. ఈ గౌరవాలు భవిష్యత్తులో మరింత సేవ చేయడానికి ప్రేరణనిస్తాయి" అని తెలిపారు.ఒకవైపు 'డాక్టర్ ఆఫ్ సోషల్ మినిస్ట్రీ' గౌరవ డాక్టరేట్, మరోవైపు 'మదర్ థెరిస్సా సేవా రత్న అవార్డు', బంగారు పతకం లభించడం ఆమె సామాజిక సేవా ప్రస్థానంలో మరో మైలురాయిగా నిలిచింది. వ్యక్తిగత ప్రయోజనాలకు అతీతంగా సమాజం కోసం పనిచేస్తున్న మహమ్మద్ సుల్తాన ఉమర్ సేవలను పలువురు అభినందించారు.మానవత్వమే మార్గంగా.. సేవే లక్ష్యంగా సాగుతున్న ఆమె సేవా ప్రస్థానానికి లభించిన ఈ గౌరవాలు మరింత మందికి సేవా స్ఫూర్తిని అందించాలని పలువురు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ కమ్యూనిటీ సభ్యులు డాక్టర్ రోనాల్డ్ జాన్, కన్సల్టెంట్ అండ్ కౌన్సిలర్ (ఎడ్యుకేషన్), హైదరాబాద్, రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ కే. జీవన్ తదితరులు పాల్గొన్నారు.




# భూదాన్ భూములపై సమగ్ర సర్వే చేపట్టాలి

**కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి: సర్వోదయ మండల్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. శంకర్ నాయక్**



పటాన్‌చెరు(ప్రశ్న న్యూస్ )తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా భూదాన్ భూములపై సమగ్ర సర్వే నిర్వహించి, వాటిని ఆక్రమించి అన్యాక్రాంతం చేస్తున్న కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సర్వోదయ మండల్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. శంకర్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సంగారెడ్డిలోని ఆర్ అండ్ బి గెస్ట్‌హౌస్‌లో ఉప్పరి రవీందర్ అధ్యక్షతన జరిగిన సర్వోదయ మండల్ జిల్లా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆచార్య వినోబా భావే పేద ప్రజల కోసం 14 సంవత్సరాల పాటు దేశవ్యాప్తంగా పాదయాత్ర చేసి, దాతల నుంచి భూములను సేకరించారని తెలిపారు. అలా సేకరించిన భూదాన్ భూములు పేదలకు దక్కకుండా భూకబ్జాదారుల చేతుల్లోకి వెళ్లడం ఆందోళనకరమన్నారు.లక్షల కోట్ల రూపాయల విలువైన భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని ఆరోపించిన ఆయన, అన్ని జిల్లాల కలెక్టర్లు భూదాన్ భూముల వ్యవహారంపై తక్షణమే దృష్టి సారించి, సమగ్ర సర్వే నిర్వహించి ప్రభుత్వ భూములను పరిరక్షించాలని కోరారు. దేశంలోనే తొలిసారిగా భూములను దానంగా స్వీకరించిన చరిత్ర తెలంగాణకు ఉందని, అలాంటి రాష్ట్రంలో భూదాన్ భూములు అన్యాక్రాంతం కావడం దురదృష్టకరమని అన్నారు.సర్వోదయ మండల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. గిరిప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సర్వోదయ మండల్ కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారు. వినోబా భావే రక్తపు బొట్టు చిందించకుండా లక్షల ఎకరాల భూమిని పేదల కోసం సేకరించారని, ఆ భూములను కాపాడేందుకు వినోబా భావే నామినీ అయిన సర్వసేవా సంఘం సలహాతో భూదాన్ యజ్ఞ బోర్డు ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు.సమావేశం అనంతరం సంగారెడ్డి జిల్లా సర్వోదయ మండల్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్. రాజు ముదిరాజ్‌లిజిల్లా ప్రతినిధిగా డాక్టర్ కిషన్ జిల్లా కార్యదర్శిగా ఎస్.కె. గంగారంలిజిల్లా ఉపాధ్యక్షులుగా గోపాల్, ఎం. భాస్కర్‌లిసహాయ కార్యదర్శులుగా చందా శ్రీనివాస్, పొల్లూరు శంకర్ ఎన్నికయ్యారు.గౌరవ అధ్యక్షులుగా అన్వర్ పటేల్, ఉప్పరి రవీందర్‌లిలను ఎన్నుకున్నారు. సర్వోదయ మండల్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. శంకర్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. గిరిప్రసాద్, రంగారెడ్డి జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు నాగజ్యోతి సమక్షంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# ఈద్ మిలాద్-ఉన్-నబీ సందర్భంగా భోజన పంపిణీ

**– అల్ అన్సార్ ఫౌండేషన్ గజ్వేల్**




గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )పవిత్రమైన ఈద్ మిలాద్–ఉన్–నబీ సందర్భంగా అల్ అన్సార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో భోజన పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని 250 మంది సభ్యులకు భోజనాన్ని ఏర్పాటు చేసి పంపిణీ చేశారు.సేవా కార్యక్రమంలో అల్ అన్సార్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ ముహమ్మద్ ఆమిర్, జనరల్ సెక్రటరీ షెహబాజ్ ఖాన్, జాయింట్ జనరల్ సెక్రటరీ సయ్యద్ ముజమ్మిల్ ఉద్దీన్, ట్రెజరర్ సయ్యద్ దానిష్ నూరీ, అలాగే సభ్యులు ఫైసల్, ఆమిర్ పాల్గొన్నారు.ఈ సేవా కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ అల్ అన్సార్ ఫౌండేషన్ తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అల్లాహ్ ఈ సేవను స్వీకరించి ప్రతి ఒక్కరినీ ఆశీర్వదించాలని ప్రార్థించారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు గజ్వేల్ బాలికల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో బాలికల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు బుధవారం ఉత్సాహంగా, సందడిగా జరిగాయి. స్థానిక మినీ స్టేడియంలో నిర్వహించిన ఈ ఎంపిక పోటీలకు సిద్దిపేట జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి 30 మంది క్రీడాకారిణులు హాజరయ్యారు.క్రీడాకారిణులు తమ ప్రతిభను చాటుకోగా, ఉత్తమ ప్రతిభ కనబరిచిన 20 మంది క్రీడాకారిణులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారిణులు సెప్టెంబర్ 4 నుంచి నిజామాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నారు.ఈ ఎంపిక కార్యక్రమాన్ని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎన్.సి. సంతోష్, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రాంగారి గణేశ్, గజ్వేల్ ఫుట్‌బాల్ క్లబ్ అధ్యక్షులు జంగం రమేష్, జిల్లా చందు, శేఖర్ పర్యవేక్షించారు.క్రీడాకారిణులకు శిక్షకుడు రాంగారి నర్సింలు శిక్షణ అందించగా, ఎంపిక కమిటీ సభ్యులు చక్రపాణి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులకు నిర్వాహకులు అభినందనలు తెలియజేసి, పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

**అర్హులైన ప్రతి పేదకు ఇందిరమ్మ ఇల్లు కేటాయింపు**

**– సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తూంకుంట అంక్షారెడ్డి**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తూంకుంట అంక్షారెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు అశోక్ రెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.బుధవారం అహ్మదీపూర్‌లో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించడంతో పాటు, గజ్వేల్‌లో కౌన్సిలర్లు శ్రీనివాస్ గుప్త, గుంటుకు లక్ష్మి శ్రీనివాస్తో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు.రూ.5.50 కోట్లతో 55 గ్రామాలకు మహిళా భవనాలు మంజూరయ్యాయని, వాటి నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అలాగే సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికి రూ.5.41 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు.గజ్వేల్ నియోజకవర్గంలో 6 వేల ఇందిరమ్మ ఇళ్లను కేటాయించి అర్హులైన పేదలకు అందిస్తున్నామని చెప్పారు. ప్రజా సంక్షేమంపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీతో పాటు రైతులకు రూ.2 లక్షల పంట రుణమాఫీ, సన్నధాన్యానికి రూ.500 బోనస్, రైతు భరోసా వంటి పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు.ఆరు గ్యారెంటీల్లో భాగంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు చేరుతున్నాయని, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి వారిని చైతన్యపరచాలని పార్టీ శ్రేణులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు సుఖేందర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కొండల్ రెడ్డి, నాయకులు అంజాగౌడ్, ప్రభాకర్, నర్సింహ రెడ్డి, శివారెడ్డి, గాడిపల్లి శ్రీనివాస్, అజహర్ తదితరులు పాల్గొన్నారు.

# కొండపై చెత్తకు చెక్.. విద్యార్థులే శుభ్రం చేశారు

**ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేసిన ఏబీవీపీ-ఎస్ఎఫ్‌డీ కార్యకర్తలు**





మంగళగిరి(ప్రశ్న న్యూస్ ) మంగళగిరి కొండపై పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని తొలగించేందుకు ఏబీవీపీ–ఎస్ఎఫ్‌డీ ఆధ్వర్యంలో విద్యార్థులు పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. కొండపై పలు ప్రాంతాల్లో ప్లాస్టిక్ సీసాలు, గుట్కా పొట్లాలు, సిగరెట్ పెట్టెలు, మద్యం సీసాలు, తినుబండారాల పొట్లాలు తదితర వ్యర్థాలు పేరుకుపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు.అభివృద్ధి చెందుతున్న మంగళగిరి నగరంలో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని విద్యార్థి నాయకులు పేర్కొన్నారు. ప్రజలు, పర్యాటకులు కొండపైకి తీసుకెళ్లే ప్లాస్టిక్ సీసాలు, ఇతర వ్యర్థాలను అక్కడే పడేయకుండా తిరిగి కిందకు తీసుకొచ్చి చెత్తబుట్టల్లో వేయాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, వీలైనంత వరకు కాటన్ (నూలు) సంచులను వినియోగించాలని కోరారు.ఏబీవీపీ––ఎస్ఎఫ్‌డీ ఆధ్వర్యంలో విద్యార్థులు కొండపై పర్యటించి వివిధ ప్రాంతాల్లో పడివున్న చెత్తను స్వయంగా సేకరించి శుభ్రం చేశారు. పర్యావరణ పరిరక్షణ కేవలం ప్రభుత్వాలు, స్థానిక సంస్థల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యతగా గుర్తించాలని పిలుపునిచ్చారు. నగరం అభివృద్ధి చెందుతున్న తరుణంలో ప్రకృతి వనరులను పరిరక్షించడంపై ప్రజల్లో మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు.

**'ప్రకృతిని కాపాడాలి'**

"ప్రకృతి మనకు ఎంతో ఇచ్చింది.. దానికి మనం తిరిగి కనీసం పరిశుభ్రతను అందించాలి" అని విద్యార్థి నాయకులు పేర్కొన్నారు. మంగళగిరి కొండను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పూర్ణిమ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం. స్వరూప్, నగర కార్యదర్శి కార్తీక్, ఉపాధ్యక్షుడు మోహన్ మనోజ్, సహకార్యదర్శి దామర్ల కళ్యాణ్ తదితర విద్యార్థి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కుల గణన చేపట్టకుంటే బీజేపీని బీసీ సామాజిక వర్గం క్షమించదు

**– బిసి పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి..**

**వనపర్తి** బీసీ కులగణన చేపట్టకుండా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తే దేశవ్యాప్తంగా బీసీలను ఏకం చేసి బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని బీసీ పొలిటికల్ జేఏసీ నాగర్కర్నూల్ జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి హెచ్చరించారు. బిసి పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలో బుధవారం రోజున మీడియా సమావేశం నిర్వహించిన కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జేఏసీ నాగర్కర్నూల్ జిల్లా అధ్యక్షులు ధన్నోజు అరవింద్ చారి మాట్లాడుతూ కేంద్రం చేపడుతున్న జనగణన లలో బీసీల కుల వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని ప్రతి కులానికి ప్రత్యేక కోడ్ ఏర్పాటు చేయాలని, డిమాండ్ చేశారు. మండల కమిషన్ సిఫార్సులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు.

తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన 42% బీసీ రిజర్వేషన్ల బిల్లుకు పార్లమెంట్ ఆమోదం పొందేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. బీసీల జనాభా లెక్కలు తెలితే రిజర్వేషన్లు పెంచాల్సి వస్తుందని భయంతోనే కేంద్రం వెన్నుకడుగు వేస్తుంది అని ఆరోపించారు. బీసీ కులగణన చేపట్టకపోతే దేశవ్యాప్తంగా బీసీల ఉద్యమం తీవ్రతరం చేస్తామని బీసీ పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి హెచ్చరించారు. ఈ సమావేశంలో బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులు శివ, హనుమంతు, సత్య, నారాయణ, శేఖర్, రమేష్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

# మంగళగిరికి మోడల్ రైతుబజార్

**రూ.18 కోట్లతో 5.90 ఎకరాల్లో నిర్మాణం..**

**రేపు మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన**

**రిటైల్, హోల్‌సేల్ కూరగాయల మార్కెట్..**

**ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు**







మంగళగిరి(ప్రశ్న న్యూస్) మంగళగిరి పట్టణానికి ఆధునిక హంగులతో మోడల్ రైతుబజార్ అందుబాటులోకి రానుంది. పట్టణంలోని నిడమర్రు రైల్వేగేట్ వద్ద రూ.18 కోట్లతో 5.90 ఎకరాల విస్తీర్ణంలో రిటైల్, హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌ను నిర్మించనున్నారు. నిర్మాణ పనులకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం శంకుస్థాపన చేయనున్నారు. అరబిందో ఫార్మా ట్రస్ట్ సీఎస్ఆర్ నిధులతో చేపట్టనున్న ఈ మార్కెట్‌ను వినియోగదారులకు సౌకర్యవంతంగా, పరిశుభ్రంగా, పర్యావరణహితంగా తీర్చిదిద్దనున్నారు. మొత్తం 71,925 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణాలు చేపట్టనున్నారు. మంగళగిరి ప్రజలు, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రిటైల్, హోల్‌సేల్ మార్కెట్లను ఒకే చోట ఏర్పాటు చేయనున్నారు. రిటైల్ మార్కెట్‌లో కూరగాయల విక్రయాలకు 102 స్టాళ్లు, పండ్లు, పూల విక్రయాలకు 54 ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారు. ఇతర వస్తువుల విక్రయాల కోసం మరో 60 దుకాణాలు నిర్మించనున్నారు. హోల్‌సేల్ మార్కెట్‌లో సరుకుల దిగుమతికి 18 అన్‌లోడింగ్ ప్లాట్‌ఫారాలు, కూరగాయల విక్రయాలకు 23 షాపులు ఏర్పాటు చేయనున్నారు.

### కోల్డ్ స్టోరేజీ.. వెజిటబుల్ వాష్ ఏరియా

మార్కెట్‌లో 61.4 చదరపు మీటర్ల విస్తీర్ణంలో కోల్డ్ స్టోరేజీ, వెజిటబుల్ వాష్ ఏరియాలు ఏర్పాటు చేయనున్నారు. 144.6 చదరపు మీటర్లలో అడ్మినిస్ట్రేషన్, మెయింటెనెన్స్ విభాగాలు, 190 చదరపు మీటర్లలో క్యాంటీన్, 130 చదరపు మీటర్లలో మరుగుదొడ్లను నిర్మించనున్నారు.

### పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు

కూరగాయలు, ఇతర సరుకులను తరలించే వాహనాలతో పాటు ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ సౌకర్యం కల్పించనున్నారు. మార్కెట్‌లో వాటర్ సంప్, ఓవర్‌హెడ్ ట్యాంక్, సెప్టిక్ ట్యాంక్, ట్రాన్స్‌ఫార్మర్, జనరేటర్ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు.

### పర్యావరణహితంగా..

చెత్త నిర్వహణకు ప్రత్యేకంగా గార్బేజ్ కలెక్షన్, ఆర్గానిక్ కన్వర్టర్ సదుపాయాలు కల్పించనున్నారు. భవనం పైకప్పుపై టెర్రస్ సోలార్ ఎనర్జీ ప్యానళ్లు ఏర్పాటు చేసేందుకు స్థలం కేటాయించారు. రైతులకు, వ్యాపారులకు, వినియోగదారులకు ఒకే చోట అవసరమైన సౌకర్యాలు అందేలా మార్కెట్‌ను ఆధునిక ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్నారు. మంగళగిరి నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న నేపథ్యంలో మోడల్ రైతుబజార్ నిర్మాణం పూర్తయితే రైతులకు మెరుగైన మార్కెటింగ్ వసతులు, వినియోగదారులకు సౌకర్యవంతమైన కొనుగోలు అవకాశం లభించనుంది.

# క్యాటరింగ్ కాంట్రాక్టు ఎర..
# హాస్టల్ యజమానులకు టోకరా

**ప్రముఖ ఐటీ కంపెనీ ప్రతినిధినంటూ నమ్మించి లక్షల వసూళ్లు**

**రూ.36.99 లక్షల మోసం..**

**23 కేసులు, మరో 6 సైబర్ ఫిర్యాదుల్లో ప్రమేయం**




వరంగల్(ప్రశ్న న్యూస్ ) ఉద్యోగం, వ్యాపారం, క్యాటరింగ్ కాంట్రాక్టు కోసం ఎదురుచూస్తున్న వారే లక్ష్యంగా.. కంపెనీల పేర్లను అడ్డుపెట్టుకుని సైబర్ మోసానికి పాల్పడుతున్న ముఠా తరహా వ్యవహారానికి తెరలేపిన ఓ నిందితుడిని హన్మకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. హాస్టల్ యజమానులకు ప్రముఖ ఐటీ కంపెనీల్లో ఉద్యోగులకు ఆహారం సరఫరా చేసే అవకాశం కల్పిస్తానని నమ్మించి.. తొలుత ఆశ చూపి, ఆ తర్వాత అగ్రిమెంట్, రిజిస్ట్రేషన్, సామగ్రి కొనుగోలు తదితర పేర్లతో డబ్బులు వసూలు చేసినట్లు దర్యాప్తులో తేలింది. డబ్బులు ఖాతాల్లోకి చేరగానే ఫోన్ స్విచ్ఛాఫ్ చేయడం.. నంబర్లు మార్చేయడం.. ఇదే అతడి మోసపు పంథాగా పోలీసులు గుర్తించారు. హన్మకొండ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన జతీ.చీశీ.461/2025, ఖ/ం 318(4) దీచీూ, ూవఝ.66-ఐ ×ు-ూూ కేసు దర్యాప్తులో నిందితుడి మోసాల చిట్టా వెలుగులోకి వచ్చింది. వరంగల్ కమిషనరేట్ పరిధితో పాటు తెలంగాణలోని పలు జిల్లాల్లోనూ ఇలాంటి మోసాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఇప్పటివరకు వెలుగులోకి వచ్చిన కేసులు, సైబర్ ఫిర్యాదులను కలిపి మొత్తం రూ.36.99 లక్షల మేర మోసం జరిగినట్లు నిర్ధారించారు. ఇందులో రూ.13.09 లక్షలు హోల్డ్ చేయడంలో పోలీసులు విజయం సాధించారు.

### హాస్టల్ బోర్డులే టార్గెట్..

నిందితుడు ముందుగా హాస్టళ్లను గుర్తించేవాడు. హాస్టల్ బోర్డులపై ఉన్న మొబైల్ ఫోన్ నంబర్లను సేకరించి.. ఒక్కొక్కరికి ఫోన్ చేసేవాడు. తాను ప్రముఖ ఐటీ కంపెనీలో పనిచేస్తున్నానని, లేదంటే ఆ సంస్థకు ప్రతినిధినని పరిచయం చేసుకునేవాడు. తమ కంపెనీలో పనిచేసే ఉద్యోగులకు భోజనం, ఆహారం సరఫరా చేయడానికి పెద్ద మొత్తంలో క్యాటరింగ్ అవసరముందని చెప్పేవాడు. తన మాటలను నమ్మించేందుకు కంపెనీ పేరు, ఉద్యోగుల సంఖ్య, క్యాటరింగ్ అవసరాలు, కాంట్రాక్టు విధానం తదితర అంశాలను ప్రస్తావించేవాడు. దీంతో హాస్టల్ యజమానులు పెద్ద కాంట్రాక్టు దక్కుతుందని ఆశపడేవారు. ఆ తర్వాతే అసలు మోసం మొదలయ్యేది.

# పిల్లలు ఎర.. తల్లులు సొర

**పిల్లల కోచింగ్ ముసుగులో తల్లులతో పరిచయాలు.. ఆపై సన్నిహిత సంబంధాలకు యత్నాలా.?**

**సౌజన్య--సాధిక్ వ్యవహారంలో వెలుగుచూస్తున్న సంచలన ఆరోపణలు**

**ఒక్క క్లూతో తప్పించుకుంటున్నాడనుకున్న వ్యక్తి పోలీసుల వలలోకి.. మరికొందరు బాధితులపైనా ఆరా**

**ఫోన్ కాల్స్ నుంచి పరారీ మార్గాల వరకు.. దర్యాప్తులో ఆసక్తికర అంశాలు**




కాకినాడ (ప్రశ్న న్యూస్) ఒకటి కాదు.. రెండు కాదు.. వరుస ఘటనలు! పరిచయం.. సాన్నిహిత్యం.. ఆపై సంబంధాల ముసుగులో ఒత్తిళ్లు.. కుటుంబాల్లో చిచ్చు.. చివరకు ప్రాణాలకే ముప్పు తెచ్చే స్థాయికి వ్యవహారం వెళ్లిందన్న ఆరోపణలు. కాకినాడలో వెలుగుచూస్తున్న సౌజన్య--సాధిక్ ఖాన్ వ్యవహారం ప్రస్తుతం అనేక అనుమానాలకు, మరెన్నో ప్రశ్నలకు తావిస్తోంది. పిల్లల కోచింగ్ పేరుతో తల్లులతో పరిచయాలు పెంచుకుని, సోషల్ మీడియా ద్వారా వారితో సన్నిహితంగా మెలిగేందుకు ప్రయత్నించేవాడనే ఆరోపణలు తాజాగా తెరపైకి రావడం కలకలం రేపుతోంది.

అయితే ఈ ఆరోపణలు దర్యాప్తులో నిర్ధారణ కావాల్సి ఉంది. పోలీసులు సేకరిస్తున్న ఆధారాలు, బాధితుల వాంగ్మూలాలు, ఫోన్ కాల్ డేటా, డిజిటల్ ఆధారాలు, ఇతర సాక్ష్యాల ఆధారంగానే అసలు వాస్తవాలు తేలాల్సి ఉంటుంది.

### పిల్లలే పరిచయానికి వారధిగా?

తమ పిల్లలను కోచింగ్‌కు పంపిన కొందరు తల్లులు వెల్లడించిన వివరాలు పోలీసుల దృష్టినీ ఆకర్షిస్తున్నట్లు తెలుస్తోంది. పిల్లల చదువు, కోచింగ్, క్లాస్ టైమింగ్స్, పనితీరు వంటి విషయాలతో సంభాషణ ప్రారంభించి.. ఆ తర్వాత వ్యక్తిగత విషయాల్లోకి వెళ్లేందుకు ప్రయత్నించేవాడని కొందరు ఆరోపించినట్లు సమాచారం. సోషల్ మీడియా వేదికగా తల్లుల స్టేటస్‌లు, ఫేస్‌బుక్, ఇతర సామాజిక మాధ్యమ ఖాతాలను గమనిస్తూ.. లైక్‌లు, కామెంట్లు, సందేశాల ద్వారా పరిచయాన్ని పెంచుకునే ప్రయత్నం చేసేవాడని కొందరు చెబుతున్నట్లు తెలుస్తోంది. మొదట పిల్లల కోచింగ్ గురించే మాట్లాడి.. ఆ తర్వాత అవసరం లేని వ్యక్తిగత సంభాషణలు పెంచేవాడని వారు ఆరోపిస్తున్నారు. ఇలాంటి వ్యవహారశైలిని గమనించిన కొందరు తల్లులు తమ పిల్లలను ఆ కోచింగ్ నుంచి తప్పించినట్లు చెబుతున్నారు. మరికొందరు క్లాస్ సమాచారం కోసం ఫోన్ చేశాడని భావిస్తే.. సంభాషణ క్రమంగా వ్యక్తిగత విషయాల వైపు మళ్లేదని మీడియాకు చెప్పినట్లు సమాచారం.

### పరిచయం.. ఆపై దగ్గరయ్యే ప్రయత్నం?

సౌజన్యతో పరిచయం కూడా ఇదే తరహాలో ఏర్పడిందా? లేక ఇద్దరి మధ్య సంబంధానికి మరేదైనా నేపథ్యం ఉందా? అనే కోణంలో దర్యాప్తు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఆమెను తనకు అనుకూలంగా మార్చుకుని, సాన్నిహిత్యం పెంచుకున్నాడని ఆరోపణలు ఉన్నాయి. ఆ తర్వాత ఇద్దరి మధ్య సంబంధం కుటుంబ వ్యవహారాలను ప్రభావితం చేసే స్థాయికి వెళ్లిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. సౌజన్య భర్త జగదీశ్వరరెడ్డి ఆరోగ్య పరిస్థితి విషయంలోనూ అనుమానాస్పద అంశాలు ఉన్నాయని కుటుంబీకులు చెబుతున్నారు. అయితే జగదీశ్వరరెడ్డి అనారోగ్యం, మరణానికి సంబంధించి ఏం జరిగిందనే విషయం అత్యంత సున్నితమైన అంశం. విషప్రయోగం జరిగిందా? మరేదైనా కారణమా? అన్నది వైద్య, ఫోరెన్సిక్ ఆధారాలతోనే నిర్ధారించాల్సి ఉంటుంది.

### ఏడాది పాటు అనారోగ్యం.. ఆపై విషాదం

జగదీశ్వరరెడ్డి కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఏడాది పాటు వాంతులు, జీర్ణకోశ సమస్యలు వంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. మాట నెమ్మదించడం, కాలు చచ్చుబడినట్లు అనిపించడం వంటి లక్షణాలు కూడా కనిపించాయని తెలిపారు. కాకినాడ సర్పవరం ప్రాంతంలోని ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రముఖ ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యుల వాదన. అక్కడ కొంత కోలుకున్న అనంతరం ఫిజియోథెరపీ కోసం మరో కేంద్రానికి తీసుకెళ్లినట్లు చెబుతున్నారు.

అక్కడ చికిత్స పొందుతున్న సమయంలోనే పరిస్థితి విషాదంగా మారిందని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. భర్త స్పందించడం లేదంటూ సౌజన్య సమాచారం ఇచ్చిందని వారు చెబుతున్నారు. ఆసుపత్రిలో ఉన్న సమయంలో తానే చూసుకుంటానని చెప్పి ఇతర కుటుంబ సభ్యులను దూరంగా ఉంచేదని కుటుంబీకులు ఆరోపించడం మరిన్ని అనుమానాలకు కారణమైంది.

### 'స్లో పాయిజన్' అనుమానాలపై దర్యాప్తు అవసరం

జగదీశ్వరరెడ్డి తీసుకునే ప్రొటీన్ షేక్‌లో ఏదైనా అనుమానాస్పద పదార్థం కలిపారా? అన్నది కుటుంబ సభ్యులు వ్యక్తం చేస్తున్న ప్రధాన అనుమానం. గతంలోనే ఇలాంటి పదార్థం కలిపి ఉండవచ్చని, మరణానికి ముందు మరోసారి అదే జరిగి ఉండొచ్చని వారు ఆరోపిస్తున్నారు. అయితే ఇవి కుటుంబ సభ్యుల అనుమానాలు, ఆరోపణలు మాత్రమే. నిజంగా ఏదైనా విషపదార్థం శరీరంలోకి వెళ్లిందా? వెళితే అది ఎప్పుడు? ఎలా? ఎవరి ద్వారా? దానికి మరణంతో సంబంధం ఉందా? అనే ప్రశ్నలకు వైద్య, ఫోరెన్సిక్ నివేదికలే సమాధానం చెప్పాల్సి ఉంటుంది.

### భర్త అడ్డు.. ఆస్తిపైనా కన్నా?

సౌజన్యను తనకు అనుకూలంగా మార్చుకున్న తర్వాత ఆమె భర్తను అడ్డుతొలగించేందుకు కుట్ర చేశాడని కూడా సాధిక్‌పై ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే ఆస్తి వ్యవహారంలోనూ కుట్రకు పాల్పడ్డాడనే ఆరోపణలు తెరపైకి వచ్చాయి. అంతేకాకుండా సౌజన్యపై దాడి చేయడం, ఆమె భర్తపై దాడికి పాల్పడడం, కుటుంబ సభ్యులను బెదిరించడం, బ్లాక్‌మెయిల్ చేయడం వంటి ఆరోపణలు కూడా విచారణలో ఉన్నట్లు సమాచారం. ఈ ఆరోపణల్లో ఏవి వాస్తవం? ఏవి అపోహలు? అన్నది దర్యాప్తులో తేలాల్సి ఉంది.

### ఆత్మహత్య ఘటనతో మలుపు

ఈ వ్యవహారం మరింత సంచలనంగా మారడానికి ఆత్మహత్య ఘటన కీలక మలుపుగా మారినట్లు తెలుస్తోంది. ఘటన అనంతరం సాధిక్ తనపై అనుమానం రాకముందే అక్కడి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించాడని పోలీసులు అనుమానించారు. అతను వినియోగిస్తున్న ఖరీదైన రెండు ఫోన్లను వదిలిపెట్టి వెళ్లినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించినట్లు సమాచారం. తనకు పరిచయమున్న కొందరి ఫోన్ నంబర్లను పాకెట్ బుక్‌లో రాసుకుని వెళ్లినట్లు తెలుస్తోంది. ఒక ఆప్తమిత్రుడికి ఫోన్ చేసి ఆ నంబర్‌ను తొలగించినప్పటికీ.. కాల్ రికార్డుల్లో ఆ సంభాషణకు సంబంధించిన జాడలు దొరికినట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

### అదే ఒక్క క్లూ.. దర్యాప్తు దిశనే మార్చిందని సమాచారం.

### బైక్ నుంచి రైలు వరకు.. పోలీసుల వెంటాడింపు

ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై సామర్లకోటకు వెళ్లిన సాధిక్.. అక్కడ బైక్‌ను పార్కింగ్‌లో ఉంచి రైల్లో ప్రయాణించినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. తన ప్రయాణాన్ని గోప్యంగా ఉంచేందుకు ఇతర ప్రయాణికుల ఫోన్లను ఉపయోగించి అవసరమైన వ్యక్తులతో మాట్లాడినట్లు దర్యాప్తులో వెలుగుచూసినట్లు సమాచారం. మహారాష్ట్రకు వెళ్లి ఒక స్నేహితుడిని కలిసిన అనంతరం అక్కడి నుంచి మీరట్‌కు బయల్దేరినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. అప్పటికే కాకినాడ పోలీసులు అతని కదలికలను ట్రాక్ చేస్తూ సంబంధిత వ్యక్తులను సంప్రదించినట్లు సమాచారం.

సాధిక్ మీరట్‌లో మరో రైఫిల్ ట్రైనర్ అబ్బాస్‌ను కలిసేందుకు వెళ్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు ముందుగానే అక్కడికి చేరుకున్నారని తెలుస్తోంది. అబ్బాస్ ఇంటి పరిసరాల్లో అతడిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించినట్లు సమాచారం.

### కేరళ వెళ్లే ఆలోచనలో ఉన్నాడని కూడా పోలీసులు అనుమానిస్తున్నట్లు తెలుస్తోంది.

### మరికొందరు ఉన్నారా?

ఇప్పుడు పోలీసుల ముందున్న అతిపెద్ద ప్రశ్న ఇదే. సౌజన్య ఒక్కరేనా? లేక ఇలాంటి పరిచయాలు మరికొందరితోనూ ఉన్నాయా?

పిల్లలను కోచింగ్‌కు పంపిన తల్లులతో సాధిక్ పరిచయాలు పెంచుకునేవాడనే ఆరోపణల నేపథ్యంలో పోలీసులు ఈ కోణాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. అతని ఫోన్ కాల్ డేటా, సోషల్ మీడియా పరిచయాలు, మెసేజ్‌లు, ప్రయాణ వివరాలు, బ్యాంకు లావాదేవీలు తదితర డిజిటల్ ఆధారాలను విశ్లేషిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

### 'పిల్లలు ఎర.. తల్లులు సొర' అన్న ఆరోపణలు

పిల్లలను కోచింగ్‌కు పంపే తల్లిదండ్రులు ఇప్పుడు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితిని ఈ వ్యవహారం గుర్తుచేస్తోంది. పిల్లల చదువు, కోచింగ్, శిక్షణ పేరుతో ఏర్పడే పరిచయాలు వ్యక్తిగత సంబంధాలుగా మారకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని పలువురు సూచిస్తున్నారు. పిల్లల సోషల్ మీడియా ఖాతాలు, కోచింగ్ సంస్థల వ్యవహారశైలి, కోచ్‌లు--తల్లిదండ్రుల మధ్య కమ్యూనికేషన్ వంటి అంశాలపై కూడా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

### దర్యాప్తుతోనే అసలు నిజం

ప్రస్తుతం ఈ వ్యవహారంలో అనేక ఆరోపణలు, అనుమానాలు, కుటుంబ సభ్యుల వాదనలు వినిపిస్తున్నాయి. వాటిలో ప్రతి అంశాన్ని ఆధారాలతో నిర్ధారించాల్సిన బాధ్యత దర్యాప్తు సంస్థలదే. ముఖ్యంగా జగదీశ్వరరెడ్డి అనారోగ్యం, మరణం, సౌజన్య--సాధిక్ మధ్య సంబంధం, ఆస్తి వ్యవహారం, ఇతర మహిళలతో పరిచయాల ఆరోపణలు, విషప్రయోగం అనుమానాలు.. ఇవన్నీ విడివిడిగా పరిశీలించాల్సి ఉంటుంది. ఒక పరిచయం ఎక్కడ మొదలైందో తెలియదు.. కానీ ఆ పరిచయం ఎక్కడికి దారితీసిందన్నదే ఇప్పుడు కాకినాడను కలవరపెడుతున్న ప్రశ్న. పిల్లల కోచింగ్ పేరుతో పరిచయాలు పెంచుకుని తల్లులను వలలోకి లాగేవాడన్న ఆరోపణలు నిజమా? సౌజన్య విషయంలోనూ ఇదే పద్ధతి పనిచేసిందా? జగదీశ్వరరెడ్డి మరణం వెనుక అసలు కారణమేంటి? ఈ ప్రశ్నలకు పోలీసుల దర్యాప్తు, ఫోరెన్సిక్ ఆధారాలు, కోర్టులో సమర్పించే సాక్ష్యాలే తుది సమాధానం ఇవ్వాలి.

# గిరిజన అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

**- ప్రతి గిరిజన తండాలో సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి శ్రీకారం**



**వనపర్తి** గిరిజనుల సంక్షేమం, అభివృద్ధితో పాటు వారి సంస్కృతి, సంప్రదాయాలు, ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వనపర్తి శాసనసభ్యులు గౌరవ శ్రీ తూడి మేఘారెడ్డి అన్నారు. వనపర్తి పట్టణంలోని పాత మార్కెట్ యార్డులో బుధవారం వనపర్తి జిల్లా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన తీజ్ ఉత్సవాల్లో ఎమ్మెల్యే శ్రీ తూడి మేఘారెడ్డి గారు పాల్గొని గిరిజన సంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక పూజలు నిర్వహించారుఈ సందర్భంగా గిరిజన యువతులు తీజ్ మొలకలతో ఎమ్మెల్యే గారిని సత్కరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ, తీజ్ పండుగ బంజారా సమాజానికి ఎంతో పవిత్రమైన, ప్రత్యేకమైన పండుగ అని అన్నారు. తీజ్ సందర్భంగా గిరిజన మహిళలు, యువతులు భక్తిశ్రద్ధలతో మొలకలను పెంచి, వాటిని పూజించి, కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరుకోవడం బంజారా సంస్కృతిలో గొప్ప సంప్రదాయమని తెలిపారు. తీజ్ పండుగ కేవలం ఒక పండుగ మాత్రమే కాదని, బంజారా సమాజం యొక్క సంస్కృతి, సంప్రదాయాలు, ఐక్యత, ఆత్మగౌరవానికి ప్రతీక అని ఎమ్మెల్యే పేర్కొన్నారుతరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రతి తండాలో సేవాలాల్ గుడి నిర్మాణానికి కృషిగిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ స్ఫూర్తితో గిరిజన సమాజం అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ప్రతి గిరిజన తండాలో సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుడుతోందని తెలిపారు. సేవాలాల్ మహారాజ్ స్మృతివనం ఏర్పాటుకు రూ.200 కోట్లతో ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం గిరిజన సమాజం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనమని ఎమ్మెల్యే అన్నారు. గిరిజనుల ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపడుతుందని తెలిపారు. వనపర్తిలో సేవాలాల్ మహారాజ్ విగ్రహం వనపర్తి పట్టణంలో సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని గిరిజన సేవా సంఘం సభ్యులు ఎమ్మెల్యే మేఘారెడ్డి ని కోరారుదీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ, గిరిజన సమాజం ఆకాంక్షను నెరవేర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గిరిజనుల అభివృద్ధి, విద్య, ఉపాధి, మౌలిక వసతులతో పాటు వారి సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. "గిరిజనుల అభివృద్ధి అంటే కేవలం ఆర్థిక అభివృద్ధి మాత్రమే కాదు... వారి సంస్కృతి, సంప్రదాయాలు, ఆత్మగౌరవం కాపాడుతూ అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే నిజమైన అభివృద్ధి" అని మేఘారెడ్డి అన్నారు. వనపర్తి గడ్డపై బంజారా సంస్కృతికి ప్రతీకగా నిలిచే తీజ్ ఉత్సవాల్లో పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉందని, గిరిజన సోదరసోదరీమణులతో కలిసి వారి సంప్రదాయ పూజల్లో పాల్గొనడం తనకు లభించిన గౌరవంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో బంజారా సేవా సంఘం నాయకులు, గిరిజన పెద్దలు, యువతులు, మహిళలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజ్ సమస్యను పరిష్కరించండి

**పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్**



మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ జిల్లా సూరారం మెయిన్ రోడ్ లో డ్రైనేజీ పొంగిపొర్లుతుందని, దీనివల్ల వాహనదారులు నరక యాతన పడుతున్నారని పర్యావరణ ప్రేమికులు కొల రవీందర్ ముదిరాజ్ ఆరోపించారు.. జిహెచ్ఎంసి సార్లు.. డ్రైనేజ్ సమస్యను పరిష్కరించాలని కొల రవీందర్ ముదిరాజ్ కోరారు., సూరారం మెయిన్ రోడ్ లో బస్ స్టాప్ వద్ద డ్రైనేజీ నీరు పొంగడం వేలాది వాహనాలు తిరిగే ఈ రోడ్డు వాహనదారులకు, నరకయాతన,ట్రాఫిక్ పోలీసులు పడుతున్న బాధ వర్ణాతీతం అని పేర్కొన్నారు.ఈ రోడ్డు వెంట ఆరు నెలల నుండి వేసే పైపులైన్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ప్రక్కన ఉన్న పాత డ్రైనేజీ లైన్ డ్యామేజ్ అవ్వడంతో ఈ సమస్య ఉత్పన్నమైందని (గత ఏడాది కూడా రోడ్డు ఇటుపక్క నర్సాపూర్ టు బాలానగర్ వెళ్లే పక్క రోడ్ లో ( వర్షపు నీటి) కాలువ నిర్మాణంలో నెలల తరబడి నిర్లక్ష్యంతో ప్రజలు తిరగబడడంతో, అధికారుల ఒత్తిడితో తూతూ మంత్రంగా పూర్తి చేసినాడని విమర్శించారు. దీనితో ప్రతిరోజు,ఉదయం, సాయంత్రం,కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ జామ్ అవుతుందని ట్రాఫిక్ పోలీసులకు తలకు మించిన భారమవుతుందని బస్ స్టాప్ ఎదురుగా ఆర్కే, ట్రాన్స్పోర్ట్, ముందర డ్రైనేజీ పైన కప్పు లేకపోవడం ప్రమాదకరంగా మారిందని ఆరోపించారు.దానిపైన సిమెంట్ మూతలు వేస్తున్నారు, ఇవి కాకుండా ఇనుపరాళ్లతో ఉన్న స్టీల్ మూత వేయాలని,ఈ రోడ్డుపై వందల టన్నుల బరువైన భారీ, అతి భారీ వాహనాలు, తిరుగుతున్నాయని అధికారులు ఆలోచించి ఈ సమస్యను పరిష్కరించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు.

# సెల్ ఫోన్ చోరీలతో బ్యాంక్ ఖాతాలు ఖాళీ

**- సరికొత్త 'హైబ్రిడ్ సైబర్ ఫ్రాడ్' పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**- హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నగర పరిధిలో సాంప్రదాయ జేబుదొంగతనాలకు ఆధునిక సైబర్ నేరాలను జోడించి అమాయకుల బ్యాంక్ ఖాతాలను ఖాళీ చేస్తున్న సరికొత్త హైబ్రిడ్ సైబర్ ఫ్రాడ్ ముఠాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ సీపీ శ్రీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ గారు హెచ్చరించారు. ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు, సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా ఉన్న అమాయకులను లక్ష్యంగా చేసుకుని ఈ ముఠాలు వ్యవస్థీకృతంగా దోపిడీకి పాల్పడుతునట్లు తమ విచారణలో బయటకు వచ్చిందని ఆయన తెలిపారు. ఈ తరహా నేరాలపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం జరిపిన దర్యాప్తులో ముగ్గురు నిందితులను ఇప్పటికే అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 5 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుంది. ఈ ముఠాలు ఒక పక్కా వ్యూహం ప్రకారం వివిధ దశల్లో నేరాలకు పాల్పడుతున్నాయి. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రద్దీగా ఉండే ఆర్టీసీ బస్సులు, బహిరంగ ప్రదేశాలలో స్మార్ట్‌ఫోన్లు వాడుతున్న వృద్ధులు, అమాయకులను వీరు మొదట గుర్తిస్తారు. బాధితులు ఫోన్ వాడుతున్నప్పుడు వారు ఏ విధంగా స్క్రీన్ లాక్ (ప్యాటన్, పిన్, పాస్వర్డ్) ఓపెన్ చేస్తున్నారో వెనుక నిలబడి చాలా నిశితంగా గమనిస్తారు. ఆ తర్వాత అదును చూసి బాధితుల దృష్టి మరల్చి జేబులు లేదా బ్యాగుల నుంచి మొబైల్ ఫోన్లను చోరీ చేస్తారు.ఒకవేళ ఫోన్ లాక్ అయి ఉండి, పాస్‌వర్డ్ వారికి తెలియకపోతే వీరు అత్యంత చాకచక్యంగా "సోషల్ ఇంజనీరింగ్" నాటకాలకు తెరలేపుతారు. బాధితుడు తన పోయిన ఫోన్‌కు కాల్ చేయగానే నిందితులు లిఫ్ట్ చేసి, తాము బస్సు కండక్టర్ లేదా డ్రైవర్ అని, ఫోన్ బస్సులో దొరికిందని, వచ్చే స్టాప్‌లో ఇచ్చేస్తామని నమ్మిస్తారు. ఆ తర్వాత వివరాలు సరిచూడాలనే నెపంతో బాధితుడితోనే స్క్రీన్ లాక్ పాస్‌వర్డ్ చెప్పించుకుంటారు. మరికొన్ని సందర్భాల్లో రోడ్డుపై ఫోన్ దొరికిందని, వేరొకరు కూడా ఆ ఫోన్ తమదే అని క్లెయిమ్ చేస్తున్నారని చెబుతూ.. ఫోన్ మీదే అని రుజువు కావాలంటే స్క్రీన్ పాస్‌వర్డ్ చెప్పాలని నమ్మించి అన్‌లాక్ వివరాలు రాబడతారు.ఫోన్ అన్‌లాక్ అవ్వగానే నిందితులు ఫోన్ గ్యాలరీ, నోట్స్, మెసేజ్‌లు, వాట్సాప్ చాట్‌లను పూర్తిగా జల్లెడ పడతారు. ప్రజలు సాధారణంగా గ్యాలరీలో భద్రపరుచుకునే డెబిట్/క్రెడిట్ కార్డుల ఫోటోలు, ఆధార్, పాన్ కార్డులు, బ్యాంక్ పాస్‌బుక్ వివరాలు, నోట్స్ యాప్‌లో రాసుకున్న పిన్‌లను సేకరిస్తారు. చోరీ చేసిన సిమ్ కార్డు నేరగాళ్ల చేతిలోనే ఉండటంతో, ఫోన్‌లోని యూపీఐ ( ఫోన్ పే, గూగుల్ పే) బ్యాంకింగ్ యాప్స్ ఓపెన్ చేసి, వచ్చే ఓటీపీల ద్వారా నెట్ బ్యాంకింగ్ పాస్‌వర్డ్‌లను, యూపీఐ పిన్‌లను రీసెట్ చేస్తారు. అనంతరం క్షణాల వ్యవధిలో బాధితుల ఖాతాల నుంచి నగదును వేరే ఖాతాలకు బదిలీ చేస్తారు. పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు ఈ డబ్బును నేరుగా వ్యక్తిగత ఖాతాల్లోకి వేసుకోకుండా, వివిధ ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌లు, డిజిటల్ వాలెట్లు మరియు కమీషన్ ఆశచూపి సేకరించిన మ్యూల్ అకౌంట్ల ద్వారా నగదును మళ్లించి చివరకు డ్రా చేసుకుంటున్నారు.ఒకవేళ ఖాతా నుంచి డబ్బులు కట్ అయినట్లు గుర్తిస్తే వెంటనే జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 కు కాల్ చేయాలి లేదా సైబర్ క్రైమ్ వెబ్సైట్ లో ఫిర్యాదు నమోదు చేయాలి. ముఖ్యంగా ఇంట్లోని యువత తమ కుటుంబాల్లోని సీనియర్ సిటిజన్లు, వృద్ధులకు ఈ తరహా సరికొత్త నేరాల పట్ల అవగాహన కల్పించి, వారు ప్రయాణాల్లో ఫోన్లు వాడేటప్పుడు అప్రమత్తంగా ఉండేలా చూసుకోవాలి.


# శ్రీశైలంలో చెంచుగిరిజనులకు ఉచిత స్పర్శదర్శనం

**ప్రతీ నెలలోనూ ఒకరోజున చెంచుగిరిజనులకు ప్రత్యేకంగా ఉచిత స్పర్శదర్శనం కల్పించాలని నిర్ణయం**



శ్రీశైలం (ప్రస్నన్యూస్) శ్రీశైలంలో ప్రతీ నెలలో కూడా చివరి బుధవారం రోజున చెంచు గిరిజన భక్తులకు ఈ ఉచిత స్పర్శదర్శనాన్ని కల్పించడం జరుగుతోంది. ఇందులో భాగంగా (26 ) చెంచు భక్తులకు శ్రీస్వామివార్ల స్పర్శదర్శనం ఉచితంగా దర్శించుకున్నారు. చెంచు గిరిజనులు స్వామివార్ల స్పర్శదర్శనం, అమ్మవారిని దర్శించుకోవడం జరిగింది. స్థానిక చెంచుగూడెములతో పాటు మార్కాపురం జిల్లాలోని 40మంది చెంచు భక్తులు స్పర్శదర్శనాన్ని చేసుకోవడం జరిగింది. దర్శనానంతరం చెంచు భక్తులందరికీ దేవస్థాన అన్నపూర్ణా ప్రసాదవితరణ భవనంలో అన్నప్రసాదాలు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ రోజు ఉదయం చెంచుగిరిజన భక్తులు సంప్రదాయబద్ధంగా తప్పెట వాయిద్యాలతో, చెంచు నృత్యాలతో దర్శనానికి విచ్చేశారు. ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద సిబ్బంది ఆహ్వానం పలికారు. శ్రీస్వామివారి ఉచిత స్పర్శదర్శనానికి చెంచుగిరిజన భక్తులను ఎంపిక చేయడంలో స్థానిక ఐ.టి.డి.ఏ ప్రాజెక్టు అధికారి వారి సహకారాన్ని తీసుకోవడం జరిగింది.

# శ్రీశైలం దేవస్థానం లో శ్రీ సాక్షిగణపతిస్వామికి విశేష అభిషేకం



శ్రీశైలం (ప్రశ్నన్యూస్)లోక కల్యాణం కోసం దేవస్థానం 26 తేదీ ఉదయం సాక్షిగణపతిస్వామి వారికి విశేష అభిషేకాన్ని నిర్వహించింది. కాగా ప్రతి బుధవారం, సంకటహరచవితిరోజులు మరియు పౌర్ణమిరోజులలో శ్రీసాక్షిగణపతి వారికి ఈ విశేషఅభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) నిర్వహించబడుతున్నాయి. సాక్షిగణపతిస్వామివారికి పంచామృతాలతోనూ, పలుఫలోదకాలతోనూ, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం నిర్వహించబడింది. తరువాత స్వామివారికి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలు జరిపించబడ్డాయి.వైదిక సంప్రదాయాలలో గణపతి అభిషేకానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఈ గణపతి అభిషేకం వలన అనుకున్న పనులలో ఆటంకాలు తొలగి విజయం లభిస్తుందని చెప్పబడుతోంది. అలాగే కోరిన కోరికలు నెరవేరుతాయని, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలుగుతాయని, ముఖ్యంగా విద్యార్థులలో ఆలోచనా శక్తి పెరిగి విద్య బాగా వస్తుందని చెప్పబడుతోంది.కాగా శ్రీశైలక్షేత్ర పరివార ఆలయాలలో సాక్షిగణపతి ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది. భక్తులు శ్రీశైల మహాక్షేత్రాన్ని సందర్శించినట్లుగా కైలాసంలో పరమేశ్వరుని వద్ద ఈ స్వామి సాక్ష్యం చెబుతాడని ప్రసిద్ధి. అందుకే ఈ స్వామి సాక్షిగణపతిగా పేరొందాడు. చక్కని నల్లరాతితో మలచబడిన ఈ స్వామి ఒకచేతిలో కలం, మరోచేతిలో పుస్తకాన్ని ధరించి భక్తుల పేర్లను నమోదు చేస్తున్నట్లుగా దర్శనమిస్తాడు.

# యుగయుగాలలో లోక పాలనకై, ధర్మ సంస్థాపనకై విష్ణువు



యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్) యాదాద్రి లక్ష్మి హైగ్రీవ సన్నిధి వేద పాఠశాలలో కొలుఉతిరూన్నటువంటి లక్ష్మి హైగ్రీవా స్వామి వారి వార్షికమైనటివసంటి పంచగా దీక్ష తో ఏక కుందాత్మంగా శ్రీ హైగ్రీవా మహా యాగం జరుగుతుంది శ్రావణ పౌర్ణమి నాడు హైగ్రీవ జయంతి మహోత్సవం మహా గాయత్రీ అమ్మవారి జయంతి మహోత్సవం లను పురస్కరించుకొని చేతుర్వేద పారాయణలు దివ్య ప్రభాందా పురాణ హితీహాస పారాయణసలు మూల మంత్ర ముక్తి మంత్ర జపాలు జరుగుతూ స్వామి వారికీ శత ఘటభిషేకం ముహత్సవము తో ఈ కార్యక్రమం ముగుస్తుంది. ఈ కార్యక్రమం ప్రత్యేకంత విద్యార్థుల నాలుకపైన బీజక్ష రాలు లోకించమనేటటువంటి ఈ క్షేత్రం యొక్క ప్రత్యేకత, ఈ హైగ్రీవా స్వామి వారు సరస్వతి కి ముప్పై మూడు కోట్ల దేవతలకు గురు అవతారంగా అవతరించిన అవతారం ఈ అవతారం విశిష్టం చాలా గొప్పనైనాటువసంటి, చదువు సంస్కారం విద్యా అనుటటువంటి ఈ స్వామి దర్శించటం మాత్రమే కలుగుతాయి, ఈ ఆలయం యాదాద్రి లో యాదాద్రి వంగపల్లి మధ్యలో కొలువైనటువంటి ఉంది. అందరు భక్తులు అందరు విచ్చేసి స్వామి వారి కటాక్షం పొంది భోజనాలు స్వీకరించాలని. కోరారు నల్లందిగేల్ లక్ష్మి నరసింహ చార్యులు వ్యవస్థాపక మహాదాచార్యులు తెలియజేశారు.

**యాదగిరిగుట్ట సమీపంలో ఉన్న శ్రీ లక్ష్మీ హయగ్రీవ స్వామి ఆలయం విద్యకు, జ్ఞానానికి అధిపతి అయిన హయగ్రీవునికి అంకితం చేయబడింది.**

**ఈ ఆలయ విశేషాలు, ప్రాముఖ్యత**

జ్ఞాన దేవుడు: హిందూ సంప్రదాయంలో లక్ష్మీ హయగ్రీవుడు విష్ణువు యొక్క విజ్ఞాన అవతారం. ఈ స్వామిని ఆరాధిస్తే చదువులో రాణిస్తారని భక్తుల నమ్మకం.క్షేత్రం ప్రత్యేకత: యాదాద్రి ప్రధాన క్షేత్రానికి చేరువలో,వంగపల్లి వెళ్లే మార్గంలో ఈ ఆలయం ఉంది. ఇక్కడ ప్రశాంతమైన వాతావరణం ఉంటుంది.అక్షరాభ్యాసాలు: చిన్న పిల్లలకు అక్షరాభ్యాసంచేయించడానికి ఈ ఆలయం చాలా ప్రసిద్ధి చెందింది. ముఖ్యంగా శ్రవణ నక్షత్రం రోజులలో ఇక్కడ విశేష పూజలు జరుగుతాయి.వేద పాఠశాల: ఈ ఆలయ సన్నిధిలో వేద పాఠశాల కూడా కొనసాగుతోంది. ఇక్కడ వేద విద్యను అభ్యసింపజేస్తూ నిత్య పూజలు, గోసేవలు నిర్వహిస్తారు.అనేక అవతారాలను దాల్చాడు. అయితే తన భక్తుల కోసం విష్ణువు దాల్చిన అవతారల్లోకి ఒకటి 'హయగ్రీవావతారం' ప్రముఖమైనది. అన్ని రకాలైన అభ్యాసం మరియు జ్ఞానం ఆయనలో మూలం మరియు అతని నుండి ఉద్భవించాయి. శ్రీ హయగ్రీవుడి అవతారం శ్రీమన్నారాయణుని ఇతర అవతారాలన్నింటిలో అగ్రస్థానం ఇవ్వబడింది. ఈ అవతారం దుష్ట శిక్షణ, శిష్ట రక్షణతో పాటు సకల మానవాళికి అజ్ఞానమనే అంధకారం నుండి ఖీఇ జ్ఞాజ్యోతుల దిశగా తీసుకువెళుతుంది.

హయగ్రీవుడు మానవాళికి జ్ఞానప్రదాతగా కొలవబడుతున్నాడు. ఈ స్వామి దివ్యరూపం కాస్త విచిత్రంగా వుంటుంది.హయము అనగా గుర్రము. హయశీర్షుడు అనగా గుర్రపు తల కలవాడు. తెల్లని తెలుపు మానవ శరీరం, గుర్రం (అశ్వము) యొక్క తల, నాలుగు చేతులు. శంఖము, చక్రము పై రెండు చేతులలో కలిగి యుండును. క్రింది కుడి వ్రేళ్ళు జ్ఞాన ముద్రలో అక్షరమాలను కలిగి ఉంటాయి. ఎడమ చేతిలో పుస్తకము ఉంటుంది. శ్రీమహావిష్ణువు ధరించిన అవతారాల్లో హయగ్రీవ అవతారం ఒకటి. ఈ అవతారంలో స్వామి వేదాలను ఉద్ధరించారు. అందువల్ల, వేదాలతోపాటు సమస్తమైన వాఙ్మయానికి, జ్ఞానానికి హయగ్రీవుడు అధిపతి అయ్యాడు. ఈ అవతారంలో స్వామి గుర్రం ముఖం, మానవ శరీరం కలిసిన రూపంలో దర్శనమిస్తాడు. స్వామి వామాంకం మీద లక్ష్మీదేవి ఆసీనురాలై ఉంటుంది. స్వామిది తెల్లటి శరీర ఛాయ. నాలుగు చేతుల్లో శంఖం, చక్రం, చిన్ముద్ర, పుస్తకాలను ధరించి భక్తులను అనుగ్రహిస్తూ ఉంటాడు.

**భగవంతుని ఇతర అన్ని అవతారాలలో భగవంతుడు కొన్ని ముఖ్యమైన సత్యాన్ని బోధించడం జరిగింది.**

అయితే హయగ్రీవ అవతారంలో మాత్రమే సాధకుడు వేదాంత సత్యాలన్నింటినీ పూర్తిగా గ్రహించగలడు. హయవదన నాటిదని చెబుతారు.అవతారం కృతయుగంమంది ఋషులు జ్ఞానాన్నియుగయుగాలుగా, చాలామరియు ఆధ్యాత్మిక పరిపూర్ణతను పొందడానికి భగవంతునియొక్క ఈ రూపాన్ని ధ్యానించారు అని మన పురాణాలలోవుంది. భాద్రపదనెలలో వచ్చే శ్రావణ పూర్ణిమ హయగ్రీవ స్వామి అవతరించిన రోజుగా మన పురాణాలలో చెప్పబడింది. ఉన్నత చదువు, లౌకిక విషయాలను అధ్యయనం ప్రారంభించినప్పుడు హయగ్రీవ స్వామిని తప్పక పూజించాలి. విద్యార్థులు హయగ్రీవ స్వామిని ప్రతి రోజు ద్యానించాలి. ఆ స్వామి యొక్క ధ్యాన శ్లోకం ఈ విధంగా వుంది.

**జ్ఞానానంద మయం దేవం నిర్మల స్పటికాకృతిమ్।**
**ఆధారాం సర్వవిద్యానాం హయగ్రీవ ముపాస్మహే ॥**

జ్ఞానం, ఆనందం, మూర్తీభవించిన దైవస్వరూపం హయగ్రీవుడు. నిర్మలమైన స్పటికాకృతి కలిగి సర్వవిద్యలకు ఆధారభూతమైన విద్యాధిదేవత హయగ్రీవునకు నమస్కారరం. హయగ్రీవుడిని పూజించిన భక్తులకు విద్యనేఈ శ్లోకం వాస్తవానికి పంచరాత్ర ఆగమాలకు చెందినది కానీ ఇప్పుడు 13వ శతాబ్దానికి చెందిన కవి-తత్వవేత్త వేదాంత దేశిక యొక్క హయగ్రీవ స్తోత్రానికి ఉపసర్గగా ఉంది అని వివిధ గ్రంధాల ద్వారా తెలుస్తోంది.

**హయగ్రీవ అవతారం గురించి పలు పురాణ కథలు ప్రచారంలో వున్నాయి. మొదటిది**

మధుకైటభులనే రాక్షసులు వేదాలను అపహరించి, పాతాళంలో దాచి పెడతారు. వేదాలు లేనిదే సృష్టికార్యం చేయలేనని బ్రహ్మదేవుడు విష్ణుమూర్తికి విన్నవించుకుంటాడు. వెంటనే, శ్రీమహావిష్ణువు హయగ్రీవ అవతారంలో పాతాళానికి వేదాలను రక్షించి, చేరి, మధుకైటభులను వధించి, బ్రహ్మదేవుడికి తిరిగి అప్పగిస్తాడు. ఇంకొక కథలో దానవులతో యుద్ధం చేసి అలసిన విష్ణువు అల్లెతాడు (నారితాడు) గడ్డం కింద ఉంచుకొని నిద్రపోతుంటాడు. దేవతల కోరిక మేరకు, శివుడు భ్రమర రూపం ధరించి, అల్లెతాటిని కొరుకుతాడు. చివాలున తెగిన రూపం ధరించి, అల్లెతాటిని కొరుకుతాడు. చివాలున తెగిన అల్లెతాటి వేగానికి విష్ణువు శిరస్సు శరీరం నుంచి వేరుపడుతుంది. విచారించిన దేవతలు, గుర్రపు తల తీసుకువచ్చి, విష్ణువుకు అతికించి, ఆయనను పునర్జీవితుడిని చేస్తారు.మరొక కథలో పూర్వం గుర్రపు తల ఉన్న ఓ రాక్షసుడు ఉండేవాడు. తనలాగే గుర్రపు తల ఉన్న వ్యక్తి చేతిలోనే తనకు మరణం ఉండాలన్న వరం ఆ రాక్షసునికి ఉంది. దాంతో అతన్ని సంహరించేందుకు విష్ణుమూర్తి హయగ్రీవ అవతారాన్ని ఎత్తినట్లు తెలుస్తుంది. హయగ్రీవుని ఆరాధించడం వలన జ్ఞానము, విజయం లభిస్తాయన్నది పెద్దల మాట. హయగ్రీవుడు సకల దేవతాస్వరూపం అని కూడా వేదాలు చెబుతున్నాయి. ఆ స్వామి కృప వలనే ఈ లోకానికి లలితా సహస్రనామం, దుర్గా త్రిశతి మొదలైన శ్లోక సంపుటి అందాయి. సాక్షాత్తు హయగ్రీవస్వామి అగస్త్య మహర్షికి శక్తి ఉపాసనా రహస్యాలను బోధించినట్లు బ్రహ్మాండ పురాణంలో ఉంది. ఆధ్యాత్మిక ప్రపంచంలో అత్యంత ప్రాచుర్యం పొందిన లలితా సహస్రనామాలు హయగ్రీవుడి వల్లే లోకంలో వ్యాప్తిచెందాయి.

# మల్లన్న సన్నిధిలో హుండీల లెక్కింపు

**హుండీల లెక్కింపు ద్వారా దేవస్థానానికి రూ. 5,88,89,846/-లు నగదు రాబడిగా లభించింది.**



శ్రీశైలం (ప్రశ్నన్యూస్) హుండీల రాబడిని భక్తులు గత 35 రోజులలో ( 22.07.2026 నుండి 25.08.2026 వరకు) సమర్పించడం జరిగింది. అలాగే ఈ హుండీలో 87 గ్రాముల 200 మిల్లీగ్రాముల బంగారు, 4 కేజీల 250 గ్రాముల వెండి లభించాయి.అదేవిధంగా 540 - యుఎస్ఏ డాలర్లు, 1610- యు.ఏ.ఇ దిర్హమ్స్, 20 - సింగపూర్ డాలర్లు, 140 - ఇంగ్లాండు పౌండ్స్, 21 - మలేషియా రింగిట్స్, 10 - సౌదీరియాల్స్, 109- బహ్రైన్ దినార్, 100 - ఓమన్ బైసా, 5 - ఓమన్ రియాల్స్ మొదలైనవి ఈ హుండీల లెక్కింపులో లభించాయి.పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాల నిఘాతో ఈ లెక్కింపును చేపట్టడం జరిగింది. ఈ హుండీల లెక్కింపును ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు , ధర్మకర్తల మండలి సభ్యులు కె. కాంతివర్ధిని, ఉప్పుటూరి సుబ్బలక్ష్మి, . పి.యు. శివమ్మ పర్యవేక్షించారు.అదేవిధంగా హుండీల లెక్కింపులో పలువిభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, దేవస్థానం సిబ్బంది శివసేవకులు పాల్గొన్నారు.

# మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో పాల్గొన్న మాజీ సర్పంచ్ ఎం.డి మంజూర్



మంథని ( ప్రశ్న న్యూస్) రామగిరి మండలం మిలాద్ ఉన్ నబీ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు, మండల కేంద్రంలోని గ్రామాల్లో ముస్లిం సోదరులు మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు, మంగళవారం రాత్రి హజరత్ మొహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జన్మదిన పురస్కరించుకొని జాగారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొహమ్మద్ ప్రవక్త ఆశీస్సులు అందరిపై ఉండి సుఖసంతోషాలతోని ఆయురారోగ్యాలతోని అష్టైశ్వర్యాలతోని ఉండాలని ఆకాంక్షించారు, ఈ కార్యక్రమంలో జామా మజీద్ ఇమామ్ మై ఫుజ్ ఆలం ,ముస్లిం సోదరులు ఎం.డి. సలీం రహీముద్దీన్, ముజాహిద్ బాబా, జాఫర్, అబురార్, అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు

## కోడి వ్యర్థాల అక్రమ రవాణా..

# దుర్వాసనతో దడ



- విజయవాడ శివార్లలో యథేచ్ఛగా వ్యర్థాల తరలింపు..
- ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం - కప్పి ఉంచకుండానే రవాణా..
- రహదారులపై దుర్వాసనతో ప్రజల అవస్థలు
- అధికారులు స్పందించి తనిఖీలు చేపట్టాలని స్థానికుల డిమాండ్

విజయవాడ(ప్రశ్న న్యూస్) విజయవాడ నగర శివారు ప్రాంతాల్లో కోడి వ్యర్థాల అక్రమ రవాణా వ్యవహారం ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. కోళ్ల ఫారాలు, చికెన్ దుకాణాలు తదితర ప్రాంతాల నుంచి సేకరిస్తున్న వ్యర్థాలను నిబంధనలకు అనుగుణంగా మూసివేసిన వాహనాల్లో తరలించాల్సి ఉన్నప్పటికీ.. బహిరంగంగా, ఎలాంటి భద్రతా ఏర్పాట్లు లేకుండా రవాణా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా రహదారులపై దుర్వాసన వ్యాపించడంతో పాటు ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుణదల, రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, విజయవాడ రూరల్ మండల పరిధిలోని మరికొన్ని ప్రాంతాల నుంచి కోడి వ్యర్థాలను సేకరించి తరలిస్తున్న ఓ వాహనంపై స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఏపీ39ఖజీ 5079 నంబరు గల వాహనం ద్వారా వ్యర్థాల తరలింపు జరుగుతోందని వారు చెబుతున్నారు. ఈ వాహనానికి సంబంధించి యజమాని, డ్రైవర్‌పై స్థానికులు ఆరోపణలు చేస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధితుల అధికారిక వివరణ అందుబాటులోకి రావాల్సి ఉంది.

### కప్పే ఏర్పాట్లు ఏవీ.?

కోడి వ్యర్థాలను బహిరంగంగా తరలిస్తే వాటి నుంచి వెలువడే దుర్వాసనతో పాటు వ్యర్థాలు రహదారిపై పడే అవకాశం ఉంటుంది. వాహనంలో వ్యర్థాలను పూర్తిగా కప్పి ఉంచకుండా రద్దీ ప్రాంతాల గుండా తీసుకెళ్తే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో ఈ వ్యర్థాల నుంచి వచ్చే దుర్వాసన మరింత భరించలేని స్థాయికి చేరుతోందని స్థానికులు చెబుతున్నారు. వాహనం తమ సమీపంలోని రహదారిపైకి వచ్చిన ప్రతిసారీ దుర్వాసన కారణంగా వాహనదారులు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పలువురు వాపోతున్నారు. కొన్నిచోట్ల వాహనం ఆగి వ్యర్థాలను ఎక్కించడం, దించడం జరుగుతున్న సమయంలో పరిసర ప్రాంతాల్లో దుర్వాసన మరింత తీవ్రంగా ఉంటోందని వారు పేర్కొంటున్నారు.

### ప్రజారోగ్యానికి ముప్పు.?

కోడి వ్యర్థాలను సక్రమంగా సేకరించి, శాస్త్రీయ పద్ధతిలో తరలించి, నిర్ణీత ప్రాంతాల్లో మాత్రమే నిర్వహించాల్సిన అవసరం ఉంది. వ్యర్థాలను బహిరంగంగా వదిలేయడం, రహదారుల వెంట పడేయడం లేదా అనుమతి లేని ప్రాంతాల్లో పారబోయడం వల్ల ఈగలు, దోమలు, ఇతర కీటకాలు పెరిగే అవకాశం ఉంటుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అంతేకాకుండా వ్యర్థాల నుంచి వచ్చే దుర్వాసన పరిసరాల పరిశుభ్రతను దెబ్బతీయడమే కాకుండా ప్రజలకు అసౌకర్యాన్ని కలిగిస్తోంది. వ్యర్థాల నిర్వహణలో నిర్లక్ష్యం కొనసాగితే సమీపంలోని నివాస ప్రాంతాలు, వ్యాపార సంస్థలు, రహదారులపై ప్రయాణించే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని స్థానికులు చెబుతున్నారు.

### నిబంధనలు ఏమవుతున్నాయి.?

వ్యర్థాలను సేకరించే వాహనాలకు సంబంధించి సంబంధిత స్థానిక సంస్థలు, కాలుష్య నియంత్రణ, పారిశుద్ధ్య విభాగాలు పాటించాల్సిన నిబంధనలు, అనుమతులు, రవాణా విధానాలు పరిశీలించాల్సి ఉంటుంది. వాహనంలో వ్యర్థాలను సురక్షితంగా తరలించే విధంగా మూసివేత ఏర్పాట్లు ఉన్నాయా? వాహనానికి సంబంధిత అనుమతులు ఉన్నాయా? వ్యర్థాలను ఎక్కడి నుంచి సేకరిస్తున్నారు? ఎక్కడికి తరలిస్తున్నారు? అక్కడ వాటిని ఏ విధంగా శాస్త్రీయంగా నిర్వహిస్తున్నారు? అనే అంశాలపై అధికారులు సమగ్రంగా తనిఖీ చేయాల్సిన అవసరం ఉంది.

### తనిఖీలు ఎక్కడ.?

ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న వాహనాలపై ఫిర్యాదులు వచ్చినప్పుడు అధికారులు కేవలం వాహనాన్ని ఆపి వెళ్లిపోకుండా.. దాని వెనుక ఉన్న మొత్తం వ్యవస్థపై దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు. వ్యర్థాలను సరఫరా చేస్తున్న చికెన్ దుకాణాలు, కోళ్ల ఫారాలు, సేకరణ కేంద్రాలు, వ్యర్థాలను తీసుకెళ్తున్న వాహనాలు, చివరకు వ్యర్థాలను అప్పగిస్తున్న ప్రదేశాల వరకు తనిఖీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. విజయవాడ నగర శివారు ప్రాంతాల్లో ఇలాంటి వాహనాలు ఎన్ని తిరుగుతున్నాయి? వాటికి అనుమతులు ఉన్నాయా? వ్యర్థాల నిర్వహణకు నిర్దిష్ట కేంద్రాలు ఉన్నాయా? అనే అంశాలపై అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తే అసలు విషయం వెలుగులోకి వస్తుందని స్థానికులు అంటున్నారు.

### రహదారులపై ప్రయాణమే కష్టం

రద్దీగా ఉండే ప్రధాన రహదారులపై కోడి వ్యర్థాలతో కూడిన వాహనాలు ప్రయాణిస్తున్నప్పుడు వెనుక వచ్చే ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. వాహనం నుంచి దుర్వాసన రావడంతో కొందరు వాహనదారులు వేగం తగ్గించుకోవాల్సి వస్తోందని, మరికొందరు వాహనం నుంచి దూరంగా వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

వ్యర్థాలు రహదారిపై పడితే పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో వ్యర్థాలు రోడ్డు పక్కన చేరితే దుర్వాసనతో పాటు పారిశుద్ధ్య సమస్యలు మరింత పెరిగే ప్రమాదం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

### అధికారులు స్పందించాలి


కోడి వ్యర్థాల రవాణా విషయంలో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయనే ఫిర్యాదులపై నగరపాలక సంస్థ, కాలుష్య నియంత్రణ, పంచాయతీ, పోలీసు తదితర సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థాలను రవాణా చేస్తున్నట్లు తేలితే సంబంధిత వాహనాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

అదే సమయంలో వ్యర్థాల సేకరణ, రవాణా, పారవేతకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలను అమలు చేయాలని కోరుతున్నారు. ఒక్క వాహనంపై చర్యలు తీసుకోవడం కంటే.. విజయవాడ పరిసరాల్లో జరుగుతున్న మొత్తం కోడి వ్యర్థాల రవాణా వ్యవస్థపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని అంటున్నారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ విషయంలో అధికారులు ఇకనైనా కళ్లు తెరవాలని.. బహిరంగంగా కోడి వ్యర్థాల రవాణాకు అడ్డుకట్ట వేసి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు

---

# దాహంతో వచ్చిన భక్తుడే టార్గెట్

- శ్రీశైలంలో బ్రాండ్ వాటర్ పేరుతో భక్తులపై భారమా.?
- ఆర్వో నీటిని క్యాన్లలో తరలించి లూజ్ వాటర్‌గా బాటిల్‌కు రూ.10.?
- లీటర్ బాటిల్ రూ.50 దాటుతోందన్న ఆరోపణలు.. విజిలెన్స్ నిఘా ఎక్కడ.?



శ్రీశైలం(ప్రశ్న న్యూస్) ఆధ్యాత్మిక క్షేత్రానికి వచ్చే భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడం దేవస్థానం బాధ్యత. అందులో తాగునీరు అత్యంత ప్రాథమికమైనది. అయితే శ్రీశైలం కొండపై భక్తుల దాహాన్ని ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు నీటి విక్రయాలను భారీ లాభాల వ్యాపారంగా మార్చుకుంటున్నారన్న ఆరోపణలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారుతున్నాయి. దేవస్థానం స్వయంగా ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసి నీటి సౌకర్యం కల్పిస్తున్నప్పటికీ.. అదే నీటిని కొందరు క్యాన్లలో తరలించి, బాటిళ్లలో నింపి 'లూజ్ వాటర్' పేరుతో విక్రయిస్తున్నారన్న ఆరోపణలు రావడం మరింత ఆందోళన కలిగిస్తోంది. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే రోజుల్లో నీటి అవసరం మరింత పెరుగుతుంది. ఆ సమయంలో బ్రాండ్ వాటర్ పేరుతో అధిక ధరలు వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయి. లీటర్ నీటి బాటిల్ రూ.50కు పైగా విక్రయిస్తున్నారన్న ఆరోపణలు నిజమైతే.. సాధారణ భక్తుడి పరిస్థితి ఏమిటన్న ప్రశ్న తలెత్తుతోంది. కుటుంబంతో కలిసి శ్రీశైలానికి వచ్చే సామాన్య భక్తుడు దర్శనం, వసతి, ప్రయాణం, భోజనం తదితర ఖర్చులతో పాటు నీటికీ అధిక మొత్తాన్ని చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడితే ఆధ్యాత్మిక క్షేత్రంలో సేవా భావం ఎక్కడ మిగులుతుందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

### దేవస్థానం ఆర్వో.. ప్రైవేటు వ్యాపారానికి ముడిసరుకా.?

శ్రీశైల దేవస్థానం భక్తుల దాహం తీర్చేందుకు వివిధ ప్రాంతాల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఉద్దేశం స్పష్టమే-భక్తులకు శుద్ధమైన తాగునీటిని అందుబాటులో ఉంచడం. అయితే ఈ వ్యవస్థలోనే అక్రమాలకు అవకాశం ఏర్పడిందన్న ఆరోపణలు ఇప్పుడు పరిశీలనకు వస్తున్నాయి. దేవస్థానం ఆర్వో ప్లాంట్ల నుంచి కొందరు వ్యక్తులు క్యాన్లు తీసుకెళ్లడం.. వాటిని బయటకు తరలించడం.. ఆ నీటిని బాటిళ్లలో నింపి విక్రయించడం జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిజంగా ఇదే జరుగుతున్నట్లయితే ఆ నీటిని తీసుకెళ్లడానికి ఎవరు అనుమతి ఇచ్చారు.? రోజుకు ఎన్ని క్యాన్లు తీసుకెళ్తున్నారు.? ఎవరి పేర్లపై క్యాన్లు ఉన్నాయి.? ఎక్కడ బాటిళ్లలో నింపుతున్నారు.? వాటికి ఎలాంటి అనుమతులు ఉన్నాయి.? అన్న ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది. దేవస్థానం ఏర్పాటు చేసిన సౌకర్యం భక్తుల కోసం అయితే.. అదే సౌకర్యాన్ని కొందరు వ్యక్తులు ప్రైవేటు లాభాల కోసం వినియోగించుకోవడం ఎలా సాధ్యం? ఈ వ్యవహారంపై దేవస్థానం అధికారుల వద్ద పూర్తి సమాచారం ఉందా? లేక అధికారుల కళ్ల ముందే ఈ దందా జరుగుతోందా.? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### బాటిల్‌కు రూ.10.. రోజుకు వేల బాటిళ్లు.?

ఆర్వో నీటిని క్యాన్లలో పట్టుకుని తీసుకెళ్లి లూజ్ వాటర్ పేరుతో ఒక్క బాటిల్‌కు రూ.10 చొప్పున విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఒక బాటిల్‌పై రూ.10 పెద్ద మొత్తంగా కనిపించకపోయినా.. రోజుకు వేల బాటిళ్లు విక్రయిస్తే ఈ చిన్న మొత్తం భారీ వ్యాపారంగా మారే అవకాశం ఉంది. శ్రీశైలానికి సాధారణ రోజుల్లోనే వేలాది మంది భక్తులు వస్తుంటారు. వారాంతాలు, పర్వదినాలు, ప్రత్యేక ఉత్సవాలు, సెలవు రోజుల్లో భక్తుల సంఖ్య మరింత పెరుగుతుంది. ఇలాంటి సమయంలో నీటికి డిమాండ్ విపరీతంగా ఉంటుంది. దాహంతో ఉన్న భక్తుడు ధర గురించి పెద్దగా ఆలోచించకుండా బాటిల్ కొనుగోలు చేసే పరిస్థితిని కొందరు వ్యాపారులు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారా.? అన్నది పరిశీలించాల్సిన అంశం.

రోజుకు ఎన్ని బాటిళ్లు అమ్ముతున్నారు.? ఒక్కో బాటిల్‌పై ఎంత లాభం వస్తోంది.? రోజుకు ఎంత నగదు చేతులు మారుతోంది.? ఈ లెక్కలు బయటకు వస్తే అసలు నీటి వ్యాపారం పరిమాణం ఎంతన్నది స్పష్టమవుతుంది.

### రూ.50 బాటిల్.. ఎంఆర్‌పీ ఎక్కడ.?

బ్రాండ్ వాటర్ పేరుతో లీటర్ బాటిల్‌కు రూ.50కు పైగా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు మరింత తీవ్రమైనవి. ఏ బ్రాండ్ అయినా బాటిల్‌పై ముద్రించిన ఎంఆర్‌పీ, విక్రయ ధర, తయారీ వివరాలు స్పష్టంగా ఉండాలి. అయితే శ్రీశైలంలో భక్తులకు విక్రయిస్తున్న ప్రతి నీటి బాటిల్‌పై ఎంఆర్‌పీ పరిశీలిస్తున్నారా.?

ఎంఆర్‌పీ కంటే అధికంగా వసూలు చేస్తున్నట్లు తేలితే సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉంది. తూనికలు--కొలతల శాఖ, ఆహార భద్రతా విభాగం, పౌరసరఫరాల అధికారులు, దేవస్థానం విజిలెన్స్ విభాగం కలిసి తనిఖీలు నిర్వహిస్తే అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

భక్తుల రద్దీ ఉన్న ప్రాంతాల్లో 'ధర ఎంత.? అని అడిగే పరిస్థితి ఉండదు. దాహం తీర్చుకోవడం అత్యవసరం. ఈ అత్యవసర పరిస్థితిని వ్యాపారులు దుర్వినియోగం చేస్తే అది సాధారణ వ్యాపారం కాదు.. భక్తుడి అవసరాన్ని ఆసరాగా చేసుకున్న దోపిడీగా మారే ప్రమాదం ఉంది.

### బయో వాటర్' పేరుతో ఏ నీరు.?

'బయో వాటర్', ఇతర బ్రాండ్ పేర్లతో నీటి బాటిళ్లు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇక్కడ అసలు ప్రశ్న నీటి పేరు కాదు.. ఆ నీరు ఎక్కడ తయారవుతోంది.? ఎవరు ప్యాక్ చేస్తున్నారు.? ఏ సంస్థకు అనుమతి ఉంది? నాణ్యత పరీక్షలు జరుగుతున్నాయా.?

బాటిల్‌పై తయారీదారు చిరునామా, బ్యాచ్ నంబర్, తయారీ తేదీ, గడువు తేదీ, ఎంఆర్‌పీ, లైసెన్స్ వివరాలు వంటి అంశాలు ఉన్నాయా లేదా అన్నది అధికారులు పరిశీలించాలి. ముఖ్యంగా దేవస్థానం పరిధిలో భక్తులకు విక్రయించే నీటి నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదు. భక్తుల ఆరోగ్యంతో ముడిపడిన అంశం కాబట్టి.. నీటి వ్యాపారంపై కేవలం ధరల కోణంలోనే కాకుండా నాణ్యత కోణంలోనూ తనిఖీలు అవసరం.

### సీసీ కెమెరాలు ఏం చెబుతున్నాయి.?

దేవస్థానం పరిధిలో వివిధ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఉంటాయి. ఆర్వో ప్లాంట్ల నుంచి క్యాన్లు ఎవరు తీసుకెళ్తున్నారు.? ఎన్ని సార్లు తీసుకెళు_న్నారు.? ఎక్కడికి తరలిస్తున్నారు? అన్నది సీసీ కెమెరా ఫుటేజీ ద్వారా తెలుసుకోవచ్చు.

ఆర్వో ప్లాంట్ నుంచి క్యాన్ బయటకు వెళ్లే సమయం.. క్యాన్ తీసుకెళ్లే వ్యక్తి.. వాహనం.. తిరిగి వచ్చే సమయం.. బాటిళ్ల విక్రయ ప్రాంతం ఇలా మొత్తం వ్యవస్థను పరిశీలిస్తే నీటి సరఫరా వెనుక ఉన్న వ్యవహారం బయటపడే అవకాశం ఉంది.

విజిలెన్స్ అధికారులు ఒక్కరోజు ఆకస్మిక తనిఖీ చేస్తే సరిపోదు. కొన్ని రోజుల సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించి, ఆర్వో ప్లాంట్ల నీటి ఉత్పత్తి--వినియోగ రికార్డులను సరిపోల్చాలి. ప్లాంట్‌లో ఉత్పత్తి అయిన నీటి పరిమాణం, దేవస్థానం వినియోగం, భక్తులకు పంపిణీ, క్యాన్ల ద్వారా బయటకు వెళ్లిన నీటి పరిమాణం.. అన్నింటినీ లెక్కిస్తే తేడాలు స్పష్టమవుతాయి.

### క్యాన్ల లెక్క తేల్చాల్సిందే

ఒక ఆర్వో ప్లాంట్ నుంచి రోజుకు ఎన్ని క్యాన్లు నింపుతున్నారు.? వాటిని ఎవరు తీసుకుంటున్నారు.? ఎలాంటి రిజిస్టర్ నిర్వహిస్తున్నారు.? క్యాన్‌కు సీరియల్ నంబర్ ఉందా.? నీటిని తీసుకెళ్లేందుకు అధికారిక అనుమతి ఉందా.? అన్నది దేవస్థానం స్పష్టం చేయాల్సి ఉంది. రిజిస్టర్‌లో ఒక లెక్క.. బయట మరో లెక్క ఉంటే.? ఇలాంటి అనుమానాలకు తావు లేకుండా ఆర్వో ప్లాంట్ల వద్ద డిజిటల్ రికార్డింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. నీటిని క్యాన్లలో తీసుకెళ్లి బాటిళ్లలో నింపుతున్నట్లు ఆరోపణలు నిజమైతే.. ఆ నీటి ప్యాకింగ్ ఎక్కడ జరుగుతోంది.? అక్కడ పరిశుభ్రత ప్రమాణాలు ఏమిటి.? బాటిల్ సీల్ ఎలా వేస్తున్నారు.? అన్నది కూడా పరిశీలించాలి.

### విజిలెన్స్ నిఘా ఎందుకు అవసరం.?

శ్రీశైలం సాధారణ పర్యాటక ప్రాంతం కాదు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చే ప్రముఖ పుణ్యక్షేత్రం. ఇక్కడ భక్తుడి నమ్మకాన్ని, అవసరాన్ని ఆసరాగా చేసుకుని ఎలాంటి అక్రమ వ్యాపారానికీ అవకాశం ఉండకూడదు. నీటి విక్రయాలపై వస్తున్న ఆరోపణలను దేవస్థానం అంతర్గతంగా మాత్రమే కాకుండా స్వతంత్ర విజిలెన్స్ విచారణకు అప్పగిస్తే మరింత పారదర్శకత ఏర్పడుతుంది.

ఆర్వో ప్లాంట్ల రికార్డులు, నీటి కొనుగోలు-విక్రయ వివరాలు, క్యాన్ల కదలికలు, బాటిల్ విక్రయాలు, వ్యాపారుల అనుమతులు, సీసీ కెమెరా ఫుటేజీ, సిబ్బంది డ్యూటీ రిజిస్టర్లు, ఫిర్యాదుల రికార్డులు.. అన్నింటినీ ఒకేసారి పరిశీలించాల్సిన అవసరం ఉంది.

### రద్దీ రోజుల్లో అసలు లెక్క ఎంత.?

సాధారణ రోజుల్లోనే వేలాది మంది భక్తులు వస్తుండగా.. శుక్ర, శని, ఆదివారాలు, సోమవారాలు, ప్రత్యేక పర్వదినాల్లో భక్తుల రద్దీ గణనీయంగా పెరుగుతుంది. ఆ సమయంలో నీటి విక్రయాలు కూడా భారీగా పెరిగే అవకాశం ఉంటుంది.

ఒక్కో భక్తుడు రోజుకు ఒకటి లేదా రెండు నీటి బాటిళ్లు కొనుగోలు చేస్తేనే ఎంత పెద్ద మార్కెట్ ఏర్పడుతుందో అర్థం చేసుకోవచ్చు. దీనికి బ్రాండ్ వాటర్, లూజ్ వాటర్, క్యాన్ వాటర్ అన్నీ కలిస్తే లావాదేవీల పరిమాణం మరింత పెరగవచ్చు.

అందుకే అధికారులు కేవలం 'నీటి ధర ఎక్కువగా ఉంది' అనే ఫిర్యాదుతో ఆగకుండా.. రోజువారీ నీటి విక్రయాల పూర్తి ఆర్థిక లెక్కలను పరిశీలించాలి.

### భక్తుడి దాహం.. ఎవరి ఆదాయం.?

శ్రీశైలానికి వచ్చే భక్తుడు దేవుడి దర్శనం కోసం వస్తాడు. తన కుటుంబంతో ప్రశాంతంగా స్వామివారి దర్శనం చేసుకుని తిరిగి వెళ్లాలని కోరుకుంటాడు. అతడి అవసరాలను సద్వినియోగం చేసుకుని అధిక ధరలు వసూలు చేయడం మొదలైతే.. క్షేత్ర ప్రతిష్ఠ దెబ్బతినే ప్రమాదం ఉంది. నీరు జీవనాధారం. దాహంతో ఉన్న వ్యక్తి ధర గురించి బేరసారాలు చేయడు. ఈ బలహీనతను వ్యాపారంగా మార్చకూడదు. దేవస్థానం ఇప్పటికే ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసినప్పుడు.. భక్తుడు మళ్లీ అధిక ధరకు నీరు కొనాల్సిన పరిస్థితి ఎందుకు రావాలి.?




### 'నీటి దందా'పై సమగ్ర తనిఖీలు ఎప్పుడు.?

శ్రీశైలంలో భక్తుల సంఖ్య పెరుగుతున్న కొద్దీ భక్తులకు అందించే సౌకర్యాలు కూడా పెరగాలి. అదే సమయంలో భక్తుల నుంచి అనధికారికంగా అధిక ధరలు వసూలు చేసే వ్యవస్థలకు అడ్డుకట్ట పడాలి. ఆర్వో నీరు ప్రజల కోసం.. కానీ అదే నీరు ప్రైవేటు వ్యాపారానికి మారితే అది తీవ్రమైన పరిపాలనా వైఫల్యమే అవుతుంది. ఆరోపణలు నిజమా కాదా అన్నది విచారణలో తేలాలి. కానీ ఫిర్యాదులు వచ్చినప్పుడు విచారణ చేయకుండా మౌనంగా ఉండటం మాత్రం సమస్యను మరింత పెంచుతుంది. విజిలెన్స్ అధికారులు ఆర్వో ప్లాంట్ల నుంచి నీటి పంపిణీ, క్యాన్ల కదలికలు, బాటిల్ విక్రయాలు, బ్రాండ్ వాటర్ ధరలు, ఎంఆర్‌పీలు, అనుమతులు, సిబ్బంది పాత్ర, వ్యాపారుల లావాదేవీలు అన్నింటినీ సమగ్రంగా పరిశీలించాలి. భక్తుడి దాహం తీర్చడం దేవస్థానం బాధ్యత.. ఆ దాహాన్ని లాభాల దాహంగా మార్చడం మాత్రం ఎవరికీ హక్కు కాదు. శ్రీశైలంలో నీటి విక్రయాలపై వస్తున్న ఆరోపణల వెనుక అసలు కథ ఏమిటో విజిలెన్స్ విచారణలో తేలాల్సిందే. దాహంతో కొండెక్కిన భక్తుడికి నీరు అందించాలి.. ధరల షాక్ ఇవ్వకూడదు. దేవుడి సన్నిధిలో సేవ పేరుతో దోపిడీకి చోటు ఉండకూడదు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588